నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
1
మంగళవారం | 09 జులై 2024 | www.navatelangana.com

బుదేరాలో లైఫ్ మెడికల్ జనరల్ స్టోర్ ప్రారంభం



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని బుదేరా చౌరస్తాలో లైఫ్ మెడికల్, జనరల్ స్టోర్‌ను మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌రావు, ఎస్ఐ సురేష్ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు సరసమైన ధరలకు మందులను విక్రయించాలని సూచించారు. డాక్టర్ సూచించిన మందులనే ప్రజలకు ఇవ్వాలన్నారు. అంతకుముందు వారిని లైఫ్‌మెడికల్ జనరల్ స్టోర్ యజ మాని తౌఫిక్ అహ్మద్ సన్మానించారు. అనంతరం తౌఫిక్‌ను వారు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మనోహర్, నాయకులు నజీర్ అహ్మద్, హాజీ తదితరులుపాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-నార్సింగి

అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని శేరిపల్లిలో చోటు చేసుకుంది. సంఘటన వివరాలలోకి వెళితే శేరిపల్లి గ్రామానికి చెందిన నాగులుగారి మహేష్ గౌడ్ (41) వృత్తి రీత్యా దర్జీ. భార్యా ముగ్గురు పిల్లలతో జీవిస్తున్నాడు. గత కొద్ది కాలంగా అప్పులు, ఆర్థిక బాధలతో సతమతమవుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధలు భరించలేక, అప్పులు తీర్చే దారి లేక సోమవారం తన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య కవిత, కొడుకులు మారుతి(17), రేవంత్(13), కూతురు ధరణి (14)లు ఉన్నారు. అప్పుల బాధ, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మ హత్య చేసుకున్నట్టు కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్‌కు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న మృతుని భార్యా పిల్లలను చూసి గ్రామస్తులు కంట తడి పెట్టారు. వారిని సముదాయించడం ఎవరి తరం కాలేదు. ప్రభుత్వం, దాతలు పెద్ద మనస్సుతో మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రాజు పటేల్



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ డిప్యూటీ తహసీల్దారుగా రాజ్‌పటేల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన సివిల్ సప్లయి డీటీఎస్‌గా విధులు నిర్వహించారు. కాగా బాధ్య తలు చేపట్టిన ఆయనను పలువురు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, సిబ్బంది, అంబేద్కర్ సంఘం కాన్సిరాం, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి డిమాండ్స్ డేను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-సదాశివపేట

రేపు(బుధవారం) జరగనున్న డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బీజేపీ ప్రభుత్వం మతోన్మాద కార్పొరేట్ శక్తులకు లాభాలు వచ్చేవిధంగా విధానాలను తయారుచేస్తున్నదన్నారు. కార్మికుల పీఎఫ్ బకాయిల చెల్లింపులో యజమానాలకు విధించే జరిమానాలను భారీగా తగ్గించారన్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గుబ్లాక్‌లను వేలం వేయడం సిగ్గుచేటన్నారు. లాభాలు అందిస్తున్న సింగరేణి సంస్థను సైతం ప్రయివేటు పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి.. కార్మికులను తిరిగి బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తున్నదన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ.. రేపు జరిగే డిమాండ్స్ డేలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా సిద్ధంవార్ దత్తాత్రేయ



నవతెలంగాణ-కంగ్టి

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు కామార్థపు మురళి సమక్షంలో సిద్ధం వార్ దత్తును జిల్లా ఉపాధ్యక్షులుగా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో జిల్లా నాయకులు ఇంత పెద్ద పదవి ఇచ్చినం దుకు ధన్యవాదాలు తెలిపారు. కాగా పద్మశాలీల సమస్యల కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాలోని పట్టణ మండల గ్రామాల పద్మశాలిలు పాల్గొన్నారు.

రాయికోడ్ ఘటపై విచారణకు కలెక్టర్ ఆదేశాలు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ డివిజన్ పరిధిలోని రాయికోడ్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలికల వసతి గృహం భవనం పై నుంచి పడి గాయపడిన విద్యార్థి ఘటనపై జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి విచారణకు అధికారులను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులతో కమిటీ వేసి పూర్తి స్థాయి విచారణ జరిపిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

డబ్బులు పెట్టి భూమిని కొనుగోలు చేశాం

ఎన్ఆర్ఐతో మాకు ఎలాంటి సంబంధం లేదు

నవతెలంగాణ-నర్సాపూర్ : నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తాలో 605 గజాల స్థలాన్ని మణికొండ రామారావు వద్ద తాము కొనుగోలు చేశామని గోడ రాజేందర్, బుచ్చేస్ యాదవ్, ఓంకార్‌లు సోమవారం మీడియాకు వివరించారు. ఎన్ఆర్ఐ అని చెప్పుకుంటున్న ఆకుల లక్ష్మణ్ రావు 2013లో మణికొండ రామారావుకు 605 గజాల స్థలాన్ని అమ్మడం జరిగిందన్నారు. అతని వద్ద తాము కొనుగోలు చేశామని రాజేందర్, బుచ్చేస్ యాదవ్, ఓంకార్ తెలిపారు. మణికొండ రామారావుతో పాటు తమ వద్ద కొనుగోలు చేసిన డాక్యుమెంట్లు పకడ్బందీగా ఉన్నాయన్నారు. భూముల ధరలకు రెక్కలు రాగానే లక్ష్మణ్ రావు పోలీసు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల పరిచయాలతో తమపై తప్పుడు కేసులు నమోదు చేయించాడని ఆరోపించారు. పోలీసులు సైతం అత్యుత్సాహం ప్రదర్శిస్తూ తమపై కేసు నమోదు చేశారని ఆరోపించారు. తాము ఎన్నారై స్థలాన్ని అక్రమంగా కాజేసినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమన్నారు. తమపై అక్రమ కేసులు పెట్టించి పరువు తీసిన వారిపై పరువు నష్టం కేసు వేస్తామన్నారు.

చెరువు శిఖం భూమిని కాపాడాలి

నల్ల పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ గూడెం మహేష్

నవతెలంగాణ-చేర్యాల : చేర్యాల మండలం నాగపురి గ్రామ రెవెన్యూ శివారులోని నల్ల పోచమ్మ చెరువు శిఖం భూమిని కాపాడాలని నల్ల పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ గూడెం మహేష్ కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ సమీర్ అహ్మద్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ నల్ల పోచమ్మ చెరువు శిఖం భూమి సర్వే నెంబర్ 831లో 22 ఎకరాల రెండుగుంటల భూమితోపాటు ఎఫ్‌టీఎల్ పరిధిలోని 13 ఎకరాల భూమిని గతంలో ఉమ్మడి వరంగల్, ఉమ్మడి మెదక్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ల సమక్షంలో నాగపురి, తిగుల్ నర్సాపూర్, జగదేవ్ పూర్ తహసీల్దార్‌ల ఆధ్వర్యంలో గ్రామస్థుల సమక్షంలో ఎఫ్‌టీఎల్ భూమిని పంచనామా చేసి హద్దులు నిర్ణయించారని తెలిపారు. ప్రస్తుతం కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు హద్దురాళ్లను తొలగించి ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారన్నారు. అలాంటి వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయ డైరెక్టర్ వినీత్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించుకోవాలి

నవతెలంగాణ కొమురవెల్లి : చదువుల కోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తించుకుని విద్యార్థినిలు శ్రద్ధతో చదువుకోవాలని చేర్యాల సిఐ శ్రీను అన్నారు. సోమవారం కొమురవెల్లి కేజీబీవీ విద్యార్థినిలకు మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఇవిటీజింగ్, పోక్సో,షీ టీమ్స్, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ సైబర్ నేరాలు,నూతన చట్టాల గురించి వివరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల యొక్క ఫోన్ కాల్స్ మాటలు నమ్మవద్దని, సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత బాగుంటుందని చెప్పారు. పిల్లలు మహిళలు ఏమైనా సమస్యలు ఇంట్లో కానీ బయట కానీ ఎదుర్కొంటే వెంటనే షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667343 మహిళా పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435 హైదరాబాద్ ఉమెన్ సేఫ్టీ వింగ్ 9440700906, 040-27852246 ఫోన్ చేసినచో, (ఫేస్ బుక్, ఎస్ డి పి టి షీ టీం జి మెయిల్ లో సమాచారం అందించాలని తెలిపారు. స్కూల్ ప్రిన్సిపల్ నీరజ, కొమురవెల్లి ఎస్ఐ రాజు గౌడ్, సదయ్య , హెడ్ కానిస్టేబుల్, మహిళా కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్లు కృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు

బోరు మోటార్ దొంగల రిమాండ్

నవ తెలంగాణ-రాయపోల్ : ఇటీవల బోరు మోటర్ దొంగలించి తప్పించుకుని తిరుగుతున్న ముగ్గురు దొంగలను పట్టుకొని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించామని దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. సోమవారం దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. దౌల్తాబాద్ మండలం గువ్వలేగి గ్రామానికి చెందిన రైతు బోయిని సిద్ధి రాములు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల అతని వ్యవసాయ పొలం వద్ద నుంచి బోరు మోటర్ గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. సిద్ధిరాములు దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు విచారణలో ఉండగా సోమవారం సాయంత్రం దౌల్తాబాద్ మండలం అహ్మద్ నగర్ పెట్రోల్ పంప్ వద్ద వాహనాల తనిఖీ చేపడుతుండగా రామాయంపేట మండలం దొంగల ధర్మారం గ్రామానికి చెందిన బొడ్డు స్వామి, బొడ్డు లక్ష్మీ నర్సయ్య, దౌల్తాబాద్ మండలం పోసానిపల్లి గ్రామానికి చెందిన అబ్రమైన సత్తయ్య ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వెంటనే ఆ ముగ్గురుని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారని తెలిపారు. చోరీకి పాల్పడిన బొడ్డు స్వామి, బొడ్డు లక్ష్మీ నర్సయ్య, అబ్రమైన సత్తయ్య ముగ్గురు వ్యక్తుల నుంచి ఒక ద్విచక్ర వాహనం, బోరు మోటర్ స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఆ ముగ్గురిని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించామని తెలిపారు. మండల పరిధిలో ఇలాంటి చోరీలకు పాల్పడితే ఎవరినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఏఎస్ఐ సాయిలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుణపరిమితి పెంచి..

రైతులకు కొత్త రుణాలివ్వాలి

- రైతుసంఘం రాష్ట్ర నాయకులు జయరాజు
- జిల్లా లీడ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-సంగారెడ్డి

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ రుణపరిమితి పెంచి రైతులకు కొత్త రుణాలు వెంటనే ఇవ్వాలని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రైతుసంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా లీడ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ రఘుకి సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం జయరాజ్ మాట్లాడుతూ.. వానాకాలం ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయినందున బ్యాంకు లు పంట రుణాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితిని పెంచి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతుల రూ.2 లక్షల రుణమాఫీని.. ప్రతీ రైతుకు వర్తించే విధంగా చూడాలన్నారు. కొన్నిచోట్ల కొత్త రుణాలు ఇవ్వని కారణంగా రైతులు ప్రయివేటు ఫైనాన్స్ వ్యక్తులను ఆశ్రయించి అధిక వడ్డీకి డబ్బులు తెచ్చి.. ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అందుకని ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీని వెంటనే అమలు చేస్తూ కొత్త రుణాలు అందరికీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నర్సింహ రెడ్డి, రాజయ్య, భూషణం, సాయి, కుమార్ పాల్గొన్నారు.

కొండాపూర్ : స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పరిమితి పెంచి.. రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలని ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్‌కు తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే.రాజయ్య సోమవారం వినతిపత్రం అందజేశారు. సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి.. ఏడు నెలలవుతున్నా ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. రైతులకు వెంటనే రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీరైతుకు రుణమాఫీ వచ్చేలాగా ప్రభుత్వం నూతన సర్క్యులర్ ఇవ్వాలన్నారు. ఎన్ని కల ఎలాంటి తేదీలు చెప్పకుండా.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఫలానా తేదీ లోపు చేస్తామంటూ చెప్పడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి.. రుణమా ఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు వెంకటేశం, అనంతయ్య,రాములు, సుదర్శన్ పాల్గొన్నారు.





స్వచ్ఛ మున్సిపాల్టీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పరిశుభ్రతకు ప్రజలంతా సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి



నవతెలంగాణ-అమీన్‌పూర్

అమీన్‌పూర్‌ను స్వచ్ఛ మున్సిపాల్టీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రజలంతా పరిశుభ్రతకు సహకరించాలని అమీన్ పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి అన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ వీపీ గౌతమ్ ఆకస్మిక పర్యటనలో భాగంగా అమీన్‌పూర్ మున్సి పాల్టీలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే మున్సిపల్ కమిష నర్ జ్యోతిరెడ్డి 'నవతెలంగాణ'తో మాట్లాడారు. ప్రజలందరూ తమ ఇండ్లలో చెత్త నిల్వ ఉంచకుండా చెత్త సేకరణకు వచ్చే ఆటో రిక్షాల్లో తడి, పొడి చెత్తగా వేరు చేసి వేయాల న్నారు. పారిశుధ్యం విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా మున్సిపల్ కార్యాలయంలో ప్రజలు నేరుగా సంప్రదించవచ్చని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వ్యాధులు సోకకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదన్నారు. నిత్యం చెత్త సేకరణ వాహనాలు అన్ని కాల నీల్లోకి వస్తున్నాయని, కానీ కొంతమంది నిర్లక్ష్యంగా తమకు ఏం సంబంధం లేని విధంగా చెత్తను ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారన్నారు. తద్వారా దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా రన్నారు. అలాంటి చర్యలకు ప్రయత్నిస్తే.. వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు మున్సిపాల్టీ నుంచి పెనాల్టీ కూడా విధిస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో ప్రజలు, మున్సిపాలిటీ సిబ్బందికి సహకరించాలని కమిషనర్ కోరారు.

విద్యార్థిని వైద్య ఖర్చులు గురుకుల యాజమాన్యమే భరించాలి





నవతెలంగాణ-సంగారెడ్డి

రాయికోడు గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థిని మల్లేశ్వరి హాస్టల్ బిల్డింగ్ రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడడంతో.. వెన్నుపూస, కాలుకు తీవ్రగాయాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. బాధిత విద్యార్థిని ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, స్వేరో నాయకులు పరామ ర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అశోక్ మాట్లాడు తూ.. బిల్డింగ్ రెండో అంతస్తు పై నుంచి కిందపడడంతో వెన్నుపూస, కాలుకు తీవ్ర గాయాలయ్యా యన్నారు. ఆ విద్యార్థికి పూర్తిగా నయం అయేవరకు గురుకుల యజమా న్యమే పూర్తి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్వేరోనాయకులు రాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ : జహీరాబాద్ కమ్యూనిటీ వైద్యశాలలో బాధిత విద్యార్థిని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టి రాజేష్ గాయాలకు గురైన విద్యార్థిని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి కుటుంబాన్ని గురుకుల యజ మాన్యం ఆదుకోవాలన్నారు. చికిత్స ఖర్చులు పూర్తిగా యజమాన్యమే భరించాలన్నారు. లేనియెడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్య మాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హరీష్,అతీక్, పృథ్వీరాజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలి



నవతెలంగాణ-సదాశివపేట

పెండింగ్ స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ ఉపాధ్యక్షులు సందీప్ డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలని, సంక్షేమ కాలేజ్ హాస్టల్‌లో ఏర్పాటు చేయాలని సదాశివపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేసి.. వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు సందీప్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్‌షిప్స్, రియంబర్స్‌మెంట్ రాక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రూ.8000 కోట్లు పెండింగ్లో ఉన్నాయన్నారు. స్కాలర్‌షిప్ రాకపోవడంతో.. విద్యార్థుల డ్రాపు అవుట్స్ పెరుగుతున్నాయన్నారు. అంతేకాకుండా సదాశివపేట మండల చుట్టుపక్కల్లో ఉన్న గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేయడం కంటే సంక్షేమ కాలేజ్‌లో హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యార్థుల పక్షాన ఆలోచించాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అర్జున్, సిద్దేశ్వర, బన్నీ, నితిన్ ,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

50 మందికి పరీక్షలు.. 6 గురికి ఆపరేషన్లు

నవతెలంగాణ-సదాశివపేట



స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆ సంఘం అధ్యక్షులు బోడపల్లి శంకరప్ప ఆధ్వర్యంలో హైదరాబాద్ మెడివిజన్ కంటి ఆసుపత్రి డాక్టర్ రేనా వారి సిబ్బంది సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 50 మంది రిటైర్డ్ ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించి.. అందులో ఆరుగురికి కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి హైదరాబాద్ మెడివిజన్ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం డాక్టర్ రేనా మాట్లాడుతూ.. కంటి చూపు తగ్గిన వారి కండ్లల్లో వెలుగు నింపడమే తమ లక్ష్యమన్నారు. తమ ఆస్పత్రి ఆధ్వర్యంలో రిటైర్డ్ ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించడం సంతోషకరమన్నారు. పరీక్షలు నిర్వహించుకున్న వారికి మందులను, కంటి అద్దాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మెడివిజన్ ఆస్పత్రి ఆర్గనైజర్ ఖలీల్, వర్మ, టెక్నీషియన్ యాదగిరి, రిటైర్డ్ ఉద్యోగ సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ కోట రుక్మాజి, సంఘం ప్రధాన కార్యదర్శి టీ పండరి, వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, అంబయ్య, సత్యనారాయణ,వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు స్వాధీనం

నవతెలంగాణ-వర్గల్



గౌరారం గ్రామంలో కిరాణా షాపులో ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారులు సిబ్బంది, గౌరారం పోలీసులు కిరాణ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల గుట్కా ప్యాకెట్లు కాటన్ బాక్సులలో లభించాయి. మొత్తం గుట్కా ప్యాకెట్ల విలువ రూ. 50 వేల వరకు ఉంటుందని గుర్తించారు. గౌరారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై ప్రభుత్వం నిషేధించిన గుట్కాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాలు, పట్టణాలలో ఇసుక, అక్రమ రవాణా చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన రవాణా గ్యాంబ్లింగ్, పేకాట ఆడినా, ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు కలిగి ఉన్నా రవాణా చేసిన ఇతర చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్ధిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445, 8712667446, 8712667447 లకు సమాచారం అందించాలని సూచించారు.

కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి

ఉద్యోగ భద్రత కల్పించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి



హత్నూర మండలం గూండ్లమాచునూర్ గ్రామ శివారులోని ఎపిటోరియా యూనిట్-3 పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని.. వారికి ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో డీసీఎల్‌కి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి. సాయిలు మాట్లాడుతూ.. ఎపిటోరియా ఫార్మా ప్రయివేటు లిమిటెడ్ యూనిట్-3 గుండ్లమాచునూర్ పరిశ్రమలో ఎంతోమంది ఏండ్లుగా కాంట్రాక్ట్ కార్మికులుగా పని చేస్తున్నారన్నారు. టెక్నికల్ రంగంలో పని చేస్తున్న కార్మికులను ఇప్పటి వరకు పర్మినెంట్ చేయడం లేదన్నారు. కార్మికుల గ్రేడ్‌ను రెండేండ్లకు మారుస్తారని.. కానీ ఇక్కడ మూడేండ్లవుతున్నా గ్రేడ్ మారచ్చడం లేదని మండిపడ్డారు. కార్మికులకు వేతనంతో కూడిన వీక్లీ ఆఫ్ కూడా ఇవ్వడం లేదన్నారు. అంతేకాకుండా సమస్యల గురించి అడిగిన కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగిస్తామంటూ యాజమన్యం బెదిరింపులకు దిగుతున్నదని ఆరోపించారు. ఈ పరిశ్రమలో 8 నుండి 13 ఏండ్లుగా పనిచేస్తున్న కార్మికులను కూడా పర్మినెంట్ చేయకపోవడం విడ్డూరమన్నారు. ఈఎస్ఐ క్రాస్ అయిన వారికి పర్మినెంట్ కార్మికుల మాదిరిగానే కాంట్రాక్ట్ కార్మికులకు కూడా హెల్త్‌కార్డు ఇవ్వలన్నారు. పరిశ్రమలో కార్మికులకు ప్రమాదాలు జరుగుతున్నా.. యాజమన్యం పట్టించుకోవడం లేదన్నారు. ఎపిటోరియా ఫార్మా ప్రయివేటు లిమిటెడ్ యూనిట్-3 పరిశ్రమలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి నాయకులు రవి, రాజేష్, మల్లేశం, రాజు, తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇండ్లను వెంటనే అప్పజెప్పాలి

నవతెలంగాణ-జహీరాబాద్



పట్టణ పరిధిలోని హెంతి(కె) వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో అసంపూర్తిగా ఉన్న పనులను తక్షణమే పూర్తి చేసి వెంటనే లబ్ధిదారులకు కేటాయించాలని సీపీఐ(ఎం) జహీరాబాద్ ఏరియా కమిటీ సభ్యులు ఎస్.మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించారు. అనంతరం ఎస్.మహిపాల్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో గతేడాది అక్టోబర్ నెలలో హడావిడిగా అధికారులు ఇండ్లను ప్రారంభించి.. సర్టిఫికెట్స్ కూడా ఇచ్చిందన్నారు. అయిన ప్పటికీ ఇప్పటివరకు పూర్తి స్థాయిలో పనులు పూర్తి కాలేదని.. ఇండ్లను కూడా అప్పజెప్పలేదన్నారు. దాంతో లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అసంపూర్తిగా ఉన్న పనులను తక్షణమే పూర్తి చేసి.. ఇండ్లను హ్యాండ్ ఓవర్ చేయాలన్నారు. లేని పక్షంలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు బక్కన్న, తిరుపతి, రాజు యాదుల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని ప్రాథమిక పాఠశాల నుంచి ప్రమోషన్ ద్వారా వెళ్లిన శ్రీరామ్, హేమసుందర్, అఫ్షన్ రోహిలకు వీడ్కోలు సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. అదే విధంగా వారి స్థానంలో పాఠశాలకు బదిలీపై వచ్చిన అశోక్, చంద్రమౌళి, బుష్రాలకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి దశరథ్, కంకోల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తుకారాం, పెద్దచెల్మెడ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పట్నం సురేందర్, మునిపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మాధవి, కంకోల్ ఉర్దూ మీడియం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మాధురి, మునిపల్లి మాజీ సర్పంచ్ రమేష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ రాములమ్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. ఉద్యోగంలో భాగం గా బదిలీలు సహజమేనన్నారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యా యులు ఈ పాఠశాల అభివృద్ధి.. పనిచేసిన విధానాన్ని కొని యాడారు. కార్యక్రమంలో అతిథులుగా తాటిపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డి, మల్లిఖార్జునపల్లి ప్రధానోపాధ్యాయులు సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే మల్లేశం

నవతెలంగాణ-మెదక్ టౌన్



అధికారుల నిర్లక్ష్యం మూలంగా 38 కుటుంబాలు 1.90 కోట్లను నష్టపోయాయని, వెంటనే అధికారులు చొరవ తీసుకొని నష్టపరిహారం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే.మల్లేశం కోరారు. ఈ మేరకు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే.మల్లేశం మాట్లాడుతూ ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల నష్టపోయిన మత్స్యకార్మిక కుటుంబాలకు రూ. 2 కోట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2022 సంవత్సరంలో మత్స్య శాఖలో అవినీతి, ఆరోపణలు వచ్చాయన్నారు. ఆరోపణల పరిశీలనలో మత్స్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగిని 2012 నవంబర్ 14న సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2023 ఫిబ్రవారిలో మళ్లీ రెండోసారి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. టైపిస్టు నిర్లక్ష్యం వలన 38 కుటుంబాలు నష్టపోయాయని నిర్ధారణలో తెలిందన్నారు. నాటి జిల్లా కలెక్టర్ 2022 డిసెంబర్ 24న మత్స్యశాఖ కమిషనర్‌కి లేఖ రాశారని తెలిపారు. కానీ ఇప్పటి వరకు నష్టపోయిన బాధితులకు రావలసిన ప్రమాద బీమా కోటి 90 లక్షల రూపాయలు రాకపోవడం దారుణమన్నారు. కానీ రెండు సార్లు సస్పెండ్ అయిన వ్యక్తి మత్స్య శాఖలో మళ్లీ అదే ఉద్యోగంలో చేరారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన పేద మత్స్య కార్మికులకు అధికారులు మాత్రం ప్రమాద భీమా డబ్బులు చెల్లించే విషయంలో నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు జిల్లా కలెక్టర్ స్పందించి నష్టపోయిన కుటుంబాలకు ప్రమాద బీమా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కిష్టయ్య, మోయిన్ తదితరులు పాల్గొన్నారు..

బైరాన్ పల్లి దుర్గమ్మ ఆలయంలో చోరీ

నవతెలంగాణ-మద్దూరు : దూల్మిట్ట మండలంలోని బైరాన్ పల్లి గ్రామంలోని దుర్గమ్మ ఆలయంలో సోమవారం పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి నందన బోయిన యాదగిరి ఉదయం 10:00 వరకు పూజలు చేసి తన ఇంటికి వెళ్లాడు. మధ్యాహ్నం ఆలయం ముందు నుంచి రోడ్డుపై అటుగా వెళుతున్న రైతు కొత్తపల్లి బాపురాజు, ఆలయం గేటు తెరిచి ఉండడంతో అనుమానంతో ఆలయం దగ్గరికి వెళ్లి చూడగా. చోరీ జరిగి నట్లు గుర్తించి పూజారితో పాటు పలువురికి సమాచారం అందించాడు. దీంతో గ్రామస్తులు ఆలయం వద్దకు వచ్చి చూడగా ఆలయంలోని దుర్గమ్మ విగ్రహానికి ఉన్న బంగారు ముక్కుపుడక, పుస్తె మట్టెలు, దొంగలు దోచుకెళ్ళినట్లు గుర్తించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ జిల్లా జగదీష్, గ్రామాన్ని సందర్శించి విచారణ చేపట్టారు .

ఎంపీ సురేష్ సెట్కార్‌ను సన్మానించిన కురుమ సంఘం సభ్యులు



నవతెలంగాణ-కంగ్టి

జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ సెట్కార్‌ను తాలుకా కురుమ సంఘం నాయకులు వారి ఆచారం ప్రకారం ఆదివారం గొంగడితో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కురుమల అభివృద్ధికి ప్రతేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని.. నారాయణఖేడ్ నుంచి ఆ కమిటీలో స్థానం కల్పిస్తామన్నారు. కురుమలు రాజ్యాకీయంగా ఎదగటానికి సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ మండలాధ్యక్షులు జైపాల్, కంగ్టి మండలాధ్యక్షులు లోండే నర్సింలు, మనూర్, నాగల్గిద్ద, మండలాల అధ్యక్షులు మల్లేష్, శ్రవణ్ మాజీ సర్పంచ్ నాగేష్ యువత అధ్యక్షులు అంజి తదితరులు పాల్గొన్నారు.

మయూర్‌నగర్ కమిటీకి అభినందనలు



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్‌లోని మయూరి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని కార్పొరేటర్ పుష్ప నాగేష్ అభినందించారు. మయూరినగర్ నూతన అధ్యక్షులు మాధవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మరియు కమిటీ సభ్యులు సోమవారం కార్పొరేటర్ నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని సభ్యులను కార్పొరేటర్ సన్మానించారు. మయూరి నగర్ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా కార్పొరేటర్ నూతన కమిటీకి తెలిపారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రాజు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ రామ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మాణిక్యరెడ్డి, రమేష్‌బాబు, బాలరాజు, అంజయ్య, కృష్ణ, వీరిశెట్టి, సత్యనారాయణ, కమలాకర్‌రెడ్డి, ప్రభుగౌడ్, చక్రవర్తి, రాజు, కోటేశ్వర్‌రావు, భాస్కర్, మోహన్‌రెడ్డి, రాజేశ్వర్, నాగభూషణం, లింగం, శ్రీధర్, వసీం కాలనీ వాసులు పాల్గొన్నారు.



నూతన వస్త్రధారణ కార్యక్రమంలో పాల్గొన్న త్రిష

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ మండల పరిధిలోని పోచారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సుధాకర్ పిల్లల నూతన వస్త్రధారణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి అదామోదర్ రాజనర్సింహ కూతురు త్రిష మణికంఠ హాజరై చిన్నారులను అభినందించారు. నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు.



ఎంటెక్‌లో వైష్ణవికి గోల్డ్ మెడల్

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణానికి చెందిన నాగారం వైష్ణవి ఎంటెక్ గోల్డ్ మెడల్ సాధించింది. వైష్ణవి 2022-23లో సీవీఆర్ కాలేజ్ హైదరాబాదులో విద్యను అభ్యసించింది. యూనివర్సిట టాపర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఆదివారం కళాశాల యాజమాన్యం ఛాన్సలర్ మరియు సిబ్బంది కలిసి ఆమెను సత్కరించారు. ఉత్తమ అవార్డు రావడం కళాశాలకు గర్వకారమని కొనియాడారు. భవిష్యత్తులో ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఈ వైష్ణవి తల్లిదండ్రులు నాగారం నరసింహులు, మాధవి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాజు వైష్ణవి, జగదీశ్వర్, సువర్ణ, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

నవతెలంగాణ-మునిపల్లి

మీ సేవ కేంద్రాలకు వివిధ ధృవ పత్రాల నిమిత్తం వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని తహసీల్దార్ తెన్‌మొళి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని మీ సేవా కేంద్రాల నిర్వాహకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పౌతి మార్పు కోసం వచ్చే ప్రజల వద్ద అందుకు సంబంధించిన సరైన పత్రాలు ఉంటేనే వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే రేషన్‌కార్డులో పేర్ల మార్పుకోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఇందుకు అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవా లన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ రవీందర్, కార్యాలయ సిబ్బంది జ్యోతి, చందు, మండలంలోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.



పలు పాఠశాలల్లో ఎంఈఓ ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-కోహీర్

మండలంలోని మద్రి, గుర్జువాడా, రాజనెల్లి, బిలాల్పూర్, గోటిగార్పల్లి ప్రాథమిక పాఠశాలల్లో మండల విద్యాధికారి ఎస్.శంకర్ సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు మరియు ఉపాధ్యాయుల బోధనా తీరును తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ గౌడ్, మాణిక్ రెడ్డి, ప్రసాద్ రావు, ఉమాదేవి, సురేష్, షఫీ హేమాడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రషర్లను తనిఖీ చేసిన పీసీబీ అధికారులు

నవతెలంగాణ-జిన్నారం

మండల పరిధిలోని మాదారం గ్రామపంచాయతీ పరిధిలోగల కంకర క్రషర్లు, క్వారీలను కాలుష్య నియంత్రణ మండలి బోర్డు అధికారులు అజయ్ వారి బృందంతో కలిసి సోమవారం తనిఖీ చేసినట్టు పటాన్‌చెరు జేఏసీ నేత సాయమొల్ల విజయ్ గౌడ్, బీఆర్ఎస్ మాదారం గ్రామాధ్యక్షులు గణేష్‌లు తెలిపారు. త్వరలోనే సంబంధిత క్రషర్లు కంకర క్వారీలకు నోటీసులు అందజేస్తామని పీసీబీ అధికారులు చెప్పారన్నారు. ఈ కంకర క్వారీల విచ్చలవిడి బ్లాస్టింగ్‌ల వల్ల వచ్చే అనర్థాలు, దుమ్ము ధూళి.. అలాగే ప్రకృతి వనరులను కొల్లగొట్టడం లాంటి అంశాల గురించి సదరు అధికారులకు విన్నవించినట్టు చెప్పారు.

188 యూనిట్లకు కూడా గృహజ్యోతి వర్తించలేదు..



నవతెలంగాణ-జిన్నారం

రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగదారులకు 'గృహజ్యోతి' పథకం కింద ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న విషయం విధితమే. అయితే తాము 188 యూనిట్ల కరెంట్ మాత్రమే వాడినప్పటికీ.. తమ కు గృహజ్యోతి వర్తించట్లేదని బీఆర్ఎస్ మండల అధ్య క్షులు గణేష్ వాపోయారు. తమకు కరెంటు బిల్లు ఫ్రీ ఎందుకు రాలేదని సంబంధిత అధికారులను ప్రశ్నించారు.

ప్రజావాణి అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు ప్రాధ్యాతనిస్తూ తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 79 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్ఓ పద్మజారాణితో కలిసి ప్రజావాణీ దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 29, ఆరోగ్య శాఖ 11, విద్యాశాఖ 8,సంక్షేమశాఖ 6 , పంచాయత్‌రాజ్ 12, డీఆర్‌డీఓకు సంబంధించి 13 మొత్తంగా 79 అర్జీలు అందాయన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణీ ద్వారా స్వీకరించిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణితో పాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత నిస్తూ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీసేసిన జీ.ఓ 80 ప్రకారం, జిల్లా స్థాయి బదిలీలు ప్రక్రియ ఈనెల 20 లోపు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో సర్వీసులు పూర్తి చేసుకున్న రాష్ట్రస్థాయి అధికారుల వివరాలు, జిల్లాస్థాయి సిబ్బంది వివరాలు, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సమర్పించా లన్నారు. జిల్లా ప్రజా పరిషత్ పదవీ కాలం ముగియడంతో మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించినట్టు చెప్పారు. ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, ఎక్కడైనా నీరు నిల్వ ఉన్నట్లు గమనిస్తే ఆయిల్ బాల్స్ వేయాలని, గంబూషియా చేప పిల్లలను వదలాలని, పిచికారీ మందు వేయించాలని, దోమలు వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయాలన్నారు. డెంగ్యూ కేసు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని, పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. గ్రామపంచాయతీల్లో జీతాలు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని.. పంచాయతీల్లో వున్నా నగదుతో సిబ్బందికి జీతభత్యాలు చెల్లించాలని ఆదేశించారు. నగదు లేని గ్రామపంచాయతీలకు గ్రాంట్ ద్వారా చెల్లించడానికి రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు. రోడ్ ప్రమాదాలు జరుగకుండా మూల మలుపులవద్ద ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటుచేయాలని ఆర్అండ్ పీఆర్ శాఖల అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. ఏకరూప దుస్తులు ఇప్పటికే మొదటి జత విద్యార్థులకు అందించడం జరిగిందని, రెండో జత కుట్టినవి కుట్టినటుట విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వీధి కుక్కలు ఆహారం కోసం రోడ్లపై తిరగడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఇంట్లో ఉన్న చెత్తను బయట రోడ్లపై పడేయకుండా చెత్తను సేకరించే మున్సిపల్ వాహనాలకే వేయాలని సూచించారు. చెత్తను సేకరించే వాహనాలు ఇంటింటికి తిరిగి చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కుక్కలకు యానిమల్ బర్త్ కంట్రోల్ చేయించి వాటి సంఖ్యను నియంత్రించడానికి 100శాతం ఫెర్టిలైజేషన్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్ఓ పద్మజారాణి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని మంజీరా స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీరా స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మానయ్య, విట్టల్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలో డిగ్రీ, పిజి, కళాశాలలు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఆడుకోవడానికి సరైన సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సంగారెడ్డిలో వివిధ స్పోర్ట్స్ అకాడమీలు ఉన్నందున ఇక్కడి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగి ప్రతిభ చాటారని గుర్తు చేశారు. జిల్లాలో క్రీడా పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. సంగారెడ్డిలో ప్రాంతీయ క్రీడా అకాడమీలను ఏర్పాటు చేయాలన్నారు.



విచ్చలవిడి కాలుష్యంపై ఫిర్యాదు

నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని కాజిపల్లి పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమలు విచ్చలవిడిగా వదులుతున్న కాలుష్యం పై పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు కాజిపల్లి కాలుష్య నివారణ జాయింట్ యాక్షన్ కమిటీ దండే రమాకాంత్ తెలిపారు. ఈ మేరకు విచ్చలవిడిగా వదులుతున్న కాలుష్యం తీరును పరిశీలించినట్టు చెప్పారు. త్వరలోనే కాలుష్య సమస్య పరిష్కరానికి హైదరాబాదులోని సనత్‌నగర్‌లో గల కాలుష్య నియంత్రణ మండలి రాష్ట్ర కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి.. కాలుష్యాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు







నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ పట్టణంలోని జహీరాబాద్ ఎంపీ సురేష్ షేట్కార్ ఆయన స్వగృహంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సీఎంగా వైఎస్సార్ రైతాంగానికి, పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ శంకర్, నారాయణ ఖేడ్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు తాహిర్ అలీ, కౌన్సిలర్‌లు వివేకానంద మహేందర్, సద్దాం, హన్మాండ్లు, కాంగ్రెస్ పార్టీ మనూర్ మండలాధ్యక్షులు సుభాష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా అమీన్‌పూర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీరంగూడ కమాన్ వద్ద ఉన్న రాజశేఖర్‌రెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వతస్థానాన్ని పొందిన, ప్రజా నాయకుడు రాజశేఖర్ రెడ్డి అని కొనియాడారు. ఆయన చేసిన సేవలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మున్న, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్, మున్సిపల్ జనరల్ సెక్రెటరీ లు రమేష్, మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి : మాజీ ముఖ్యమంతి రాజశేఖర్ జయంతి వేడుకలను మండలంలోని కంకోల్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు, తీన్మార్ మల్లన్న టీం సభ్యులు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రమేష్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు వీరన్న,ప్రభు,శివకుమార్ నరసింహులు, జైపాల్, విక్రమ్, మొజుద్దీన్, ముఖిమ్,శేఖర్ పాల్గొన్నారు.

జోగిపేట-పోచారం బస్సు పునరుద్ధరించండి

- సంగారెడ్డి డిపో మేనేజర్‌కు పలు గ్రామాల ప్రజల వినతి
- మంత్రి సొంత మండలంలోనే బస్సుల్లేక ఇబ్బందులు



నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ మండల పరిధిలోని పోచారం, బస్వాపూర్, ఎస్ ఇటిక్యాల నుంచి ప్రతీరోజు సుమారు వంద మంది విద్యార్థులు చదువుల కోసం జోగిపేట పట్టణానికి వెళ్తుంటారు. గతంలో ఈ విద్యార్థుల కోసం ఉదయం 8 గంటలకు, సాయంత్రం నాలుగు గంటలకు, రాత్రి 9 గంటలకు జోగిపేట నుంచి పోచారం వరకు ఆర్టీసీ బస్సును నడిపారు. అయితే గత రెండు నెలల నుంచి ఆ బస్సును ఆపివేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులతో పాటు వివిధ పనుల మీద జోగిపేటకు వెళ్లే ప్రజలు కూడా నానా అవస్థలు పడుతున్నారు. దాంతో ఆ బస్సును తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ బస్వాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ విష్ణయ్య పలు గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం సంగారెడ్డి డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం విష్ణయ్య మాట్లాడుతూ.. ఈ సమస్యపై ఇది వరకే పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. అందుకే డిపో మేనేజర్‌కు విన్నవించినట్టు చెప్పారు. అయితే రోడ్డు బాగాలేకపోవడంతో బస్సును ఆపేసినట్టు మేనేజర్ చెప్పాడని.. కాగా సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్లు కూడా బాగు చేయిస్తామని విష్ణయ్య చెప్పారు. దాంతో త్వరలోనే మళ్లీ జోగిపేట నుంచి పోచారం వరకు మూడు పూటల బస్సును పునరుద్ధరిస్తామని మేనేజర్ హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. కాగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సొంత మండలంలో ఈ విధంగా విద్యార్థులు ఇబ్బంది పడడం చాలా బాధాకరమని పలువురు అన్నారు. వెంటనే మంత్రి స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఆర్టీసీ టెండర్ల ప్రక్రియ రద్దు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న టెండర్ల ప్రక్రియను వెంటనే రద్దు చేయాలిని టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంత కిషన్ కోరారు. చిరు వ్యాపారులతో కలిసి డిపో మేనేజర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. మేనేజర్ బయటికి రాకపోవడంతో రీజినల్ మేనేజర్ కార్యాలయ డోర్‌కు వినతి పత్రాన్ని అతికించారు. ఈ సందర్భంగా తోపాజీ అనంత కిషన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ రీజియన్ మేనేజర్ తీరుతోనే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నదని ఆరోపించారు. చిరు వ్యాపారుల ఇబ్బందులను వినతి పత్రం ద్వారా తేయలియజేయాలనుకుంటే రీజినల్ మేనేజర్ కనీసం కార్యాలయం నుంచి కూడా బయటకి రాకపోవడంపై మండిపడ్డారు. అహంకారంగా వ్యవహరించిన రీజినల్ మేనేజర్ పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. రీజినల్ మేనేజర్ తీరు మార్చుకోవాలన్నారు. గత 40ఏండ్లుగా చిరు వ్యాపారులు అక్కడే వ్యాపారం చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. టెండర్ ప్రక్రియ ప్రారంభం కాకముందు చిరు వ్యాపారులు డిపో మేనేజర్‌ను కలసి.. టెండర్ వేస్తే తమ బతుకులు ఆగం అవుతావని చెప్పినా, పటించుకోకుండా టెండర్ వేశారని మండిపడ్డారు. వెంటనే టెండర్ ప్రక్రియ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జార్జ్, కూన సంతోష్, కిరణ్ గౌడ్, కాసిని రాజు, భిక్షపతి, నవాజ్, లక్ష్మణ్, సోహెల్, రాజు, పవన్, ఇమ్రాన్, ఇస్మాయిల్, చిరు వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు ముందుకు రావడం అభినందనీయం



నవతెలంగాణ-మునిపల్లి

విద్యార్థుల అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు ముందుకు రావడం.. సేవా భావాన్ని పెంపొందించడం నిజంగా అభినందనీయమని మగ్దూంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.యాదయ్య అన్నారు. పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు ప్రకాష్, షరీఫ్‌లకు వీడ్కోలు.. నూతనంగా పాఠశాలకు విచ్చేసిన ఉపాధ్యా యులు యాదగిరి, సయ్యద్ అహ్మద్‌లకు ఆత్మీయ ఆహ్వాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు యాదగిరి సొంత నిధులతో పిల్లలకు రాత పుస్తకాలు, పలక లు, ఇతర రాత సామగ్రిని అందజేయడం నిజంగా ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్ర మంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు రసూల్‌పటేల్, జంషీద్ నాగిశెట్టి, వీరన్న, శామయ్య పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని ఎస్సీ కాలనీలో నివసించే వృద్ధురాలు ఎల్లమ్మ(80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న యువజన కాంగ్రెస్ నాయకుడు వి.ప్రవీణ్‌రెడ్డి వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వి.వి.ఆర్ ఫౌండేషన్ తరపున అంత్యక్రియల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆర్థికంగా అండగా నిలిచిన నాయకుడికి బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.రాజగోపాల్, నరసింహ, బాల్ రాజ్, యాదగిరి, రవి, కాలనీవాసులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయించాలి

ఎంపీకి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల వినతి



నవతెలంగాణ-నర్సాపూర్

ప్రైవేట్ కళాశాలలకు గత మూడు సంవత్సరాల నుంచి పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, విద్యార్థులకు రావలసిన స్కాలర్షిప్‌లను విడుల చేయించే విధంగా కృషి చేయాలని ఎంపీ రఘునందన్‌రావును ఎంపీకి ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కోరాయి. సోమవారం నర్సాపూర్ వచ్చిన మెదక్ ఎంపీ రఘునందన్ రావుకు తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ మెదక్ జిల్లా తరఫున వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు కళాశాలలు పడుతున్న ఇబ్బందులను, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వెంటనే చెల్లించే విధంగా కృషి చేయాలని ఎంపీకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజ్ మేనేజ్మెంట్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ నల్లగండ్ల అశోక్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ రెడ్డి, శోభన్ బాబు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ



నవతెలంగాణ-తూప్రాన్

హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. దాత కాసు శ్రీనివాస్ రావు సహకారంతో అనాధ విద్యార్థులకు నోటుపుస్తకాలను పంపిణీ చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. దాత కాసు శ్రీనివాస్ రావు,కాసు హరిక,సహకారంతో పాఠశాలలో 30 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు పాఠశాల విద్యార్థులకు అందించనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ పర్వతి సత్యనారాయణ మాట్లాడుతూ చదువు మాత్రమే విద్యార్థుల భవిష్యత్తును మార్చగలుగుతుందన్నారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఫ్లోరెన్స్, ఉపాధ్యాయులు యోహాన్, సరోజిని, జయ,ఉమాదేవి శైలజ, మంజుల మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువు కట్టపై మొక్కలు నాటిన చైర్మన్



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని రాయరావు చెరువు కట్టపై సోమవారం 75వ వన మహోత్సవంలో భాగంగా నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జైత్రామ్ నాయక్, కౌన్సిలర్స్ రామచందర్, బుచ్చేష్ యాదవ్, ఎరుకల యాదగిరి, ఆంజనేయులు గౌడ్, మేనేజర్ మధుసూదన్, సిబ్బంది శ్రీకాంత్, సల్ల మురళి తదితరులు ఉన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

పేటలో మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాయిని మధుసూదన్, రాష్ట్ర ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి జనార్ధన్, సంగమేష్ సేట్, సత్యనారాయణ రావు, పట్టణ అధ్యక్షుడు గంగారెడ్డి, గోవింద్ రావు, సుభాష్ గౌడ్, వసీం భాయ్,యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భాను గౌడ్, జహంగీర్, విఠల్ రెడ్డి, కుమార్, శ్రీనివాస్, వెంకట్ రావు, సాయిలు, అశోక్ రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన చైర్మన్ అశోక్ గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణంలోని నాలుగో వార్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాలను సోమవారం మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ సందర్శించి పరిశీలించారు. ప్రస్తుతం వర్షాకాలం అయినందున సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని అందువల్ల పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా తుకారాం తండాలో అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎన్నికల యాదగిరి, వార్డు ఆఫీసర్ పరశురాం రెడ్డి తదితరులు ఉన్నారు.

ముళ్ల పొదలను తొలగించిన పారిశుధ్య కార్మికులు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలోని వాడవాడలా ముళ్ళపొదలను గ్రాస్ కట్టర్‌తో పారిశుద్ధ కార్మికులు తొలగించారు. వర్షాకాలం వచ్చినందున సీజనల్ వ్యాధులు సోకకుండా డ్రైనేజీలను క్లీన్ చేస్తూ గడ్డిని ముళ్లపొదలను తొలగించారు. ఈ కార్యక్రమంలో కోమ్మా ట రవి, కుమార్, రాజవ్వ, తదితరులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ, ముత్యాలమ్మకు బోనాలు



నవతెలంగాణ-వెల్దుర్తి

ఆషాడ మాసం పురస్కరించుకొని ప్రతి సంవత్సరం నిర్వహించే అమ్మవార్లకు బోనాల నిర్వహణ కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్లపోచమ్మకు ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. వేదమంత్రాలు డప్పు వాయిద్యాలతో పోతురాజుల విన్యాసం శివసత్తుల నాట్యంల మధ్య నల్ల పోచమ్మ ముత్యాలమ్మకు గౌడ సంఘం ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. ఉదయం అమ్మవార్లకు వడిబియాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బోనాలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. మండల కేంద్రంలో ఆహ్లాద వాతావరణం చోటుచేసుకుంది.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ఆర్డీవో జయచంద్రారెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండల పరిధిలోని దాతర్ పల్లిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజ్ బాలికలు, పాఠశాలలో విద్యార్థినీలకు, ఉపాధ్యాయ బృందానికి మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ జయచందాద్రారెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు వ్యసనాలపై యువత, వారి తల్లి తండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కౌన్సిలింగ్ ప్రోగ్రాం ఏర్పాటుచేసి, యువత డ్రగ్స్‌కు అలవాటు కాకుండా చూడాలన్నారు. మాదక ద్రవ్యాల నివారణకు తగిన సూచనలు, జాగ్రత్తలను ఆర్డీవో జయచంద్రా రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సద్గుణ మేరిగ్రేసి, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వంగపల్లి దీక్షకు మద్దతు



నవతెలంగాణ-తూప్రాన్

ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ ఇందిర పార్క్ వద్ద ఏబిసిడి వర్గీకరణ చేయాలని లక్ష్యంతో చేపట్టిన దీక్షకు జిల్లా ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఏర్పడి ఈరోజుతో 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మాదిగల ప్రధాన డిమాండ్ అయిన ఎస్సీ వర్గీకరణ కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు కోరారు. ఈ దీక్షకు ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర కార్యదర్శి గుడి కృష్ణ, ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు గర్గుల శ్రీనివాస్, జిల్లా నాయకులు బాలసాయి హరిప్రసాద్, చీమల బిక్షపతి, దుర్గపతి, స్వామి, రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

మర్చిపోలేని మహనేత వైఎస్ఆర్

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బుడ్డ భాగ్యరాజ్



నవతెలంగాణ-తూప్రాన్

మరచిపోలేని మహనేత మాజీ సీఎం వైయస్సార్ అని జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ కొనియాడారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి యంతిని పురస్కరించుకొని పట్టణంలోని నర్సాపూర్ రోడ్ చౌరస్తాలో జై హనుమాన్ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో వైయస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బుడ్డ భాగ్యరాజ్ మాట్లాడుతూ వైఎస్ఆర్ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. సంక్షేమ సారధిగా ప్రజలకు అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత వైఎస్‌కే దక్కుతుందన్నారు. రైతన్నలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మి ఉచిత విద్యుత్‌ను ప్రవేశపెట్టడంతోపాటు ఒకే దఫా రుణమాఫీ చేయడమే కాకుండా సాగునీటి రంగాన్ని బలోపేతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజవర్గం సేవాదళ్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఆర్.ఎం.పి, పీఎంపీ డాక్టర్స్‌అసోసియేషన్ అధ్యక్షులు అప్సర్ బాయ్, గరిగే నర్సింగరావు, పన్నీరు రాము, దొంతి సోమయాదగిరి, కుమ్మరి రమేష్, ఆకుల కుమార్, గజానంద్ నాగరాజ్, బొలేపోయిన మహేష్ యాదవ్ కార్యకర్తలు, పాల్గొన్నారు.

ప్రజావాణిలో 184 దరఖాస్తుల స్వీకరణ

- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు జిల్లాలోని అయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి సమస్యలు తీరుతాయని దూరప్రాంతాల నుంచి వస్తుంటారని వారి సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో అధికారులు వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ విషయంలో సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించి వాటిని అధికారులకు అందచేశారు. ప్రజావాణిలో భూ సమస్యలకు సంబంధించి 48, పెన్షన్‌కు సంబంధించి 20, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకు 47, జీవనోపాధి సమస్యలపై 05, ఇతర సమస్యలు 64 దరఖాస్తులు, మొత్తం 184 దరఖాస్తులు స్వీకరించామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటా

- **ఎంపీ రఘునందన్‌రావు**



నవతెలంగాణ-నర్సాపూర్

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఓటు వేసి మెదక్ ఎంపీగా గెలిపించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని, విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్క బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని సాయి కృష్ణ కళ్యాణ మండపంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రజలకు కృతజ్ఞతలు తెలిపే కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గం నుంచి తను అనుకున్న దానికంటే 51 వేల ఓట్లు అందించినందుకు ఈ ప్రాంతంలోని బీజేపీ నాయకులను అభినందించారు. బీజేపీ నాయకులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రం ఇన్చార్జులు, కార్యకర్తల కృషితోనే తన విజయం సాధ్యమైందని గుర్తు చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులుగా, ఎంపీటీసీగా కౌన్సిలర్లుగా పార్టీ నాయకులు, కార్యకర్తలను గెలిపించేందుకు తాను కృషి చేస్తానని వెల్లడించారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావును శాలువాలతో పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్, కౌన్సిలర్ బుచ్చిష్ యాదవ్, బిజెపి ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ హెచ్.వి.రమణారావు, సంఘసాని సురేష్ , ఓబిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్ద రమేష్ గౌడ్, బిజెపి మండల అధ్యక్షులు నీలి నాగేష్, పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణ

- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



నవతెలంగాణ-మెదక్ టౌన్

తెలంగాణ రాష్ట్రంలో గ్రామీణ ఆవిష్కరణ వెలికి తీసి ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం మళ్లీ మీ ముందుకు వచ్చిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటింటా ఇన్నోవేటర్ 2024, 6వ ఎడిషన్‌ను కమిటీ సభ్యులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రతి ఏడాది లానే ఈ ఏడాది కూడా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి ఆవిష్కర్తలు ధరకాస్తు చేసుకునే సమయం వచ్చేసిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇంటింటా ఇన్నోవేటర్ ప్రోగ్రామ్ ఆరేళ్లగా విజయవంతంగా సాగుతోందని, 2019లో ప్రారంభించిన ఆ కార్యక్రమం ద్వారా ప్రతి వ్యక్తిలో దాగి ఉన్న ఆలోచనలు వెలికితీసి ఆవిష్కరణలుగా మార్చి సమాజంలోని సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రతి ఏటా జిల్లా, రాష్ట్రస్థాయిలో ఉత్తమమైన ఆవిష్కర్తలు, ఆవిష్కరణలను ఎంపిక చేసి బహుమతులు అందించే కార్యక్రమానికి ఈ ఏడాది ఆగస్టు 5 ఆఖరి తేదీ ప్రకటించిందన్నారు. ప్రతి వ్యక్తిలో దాగి ఉన్న ఆలోచనలను వెలికితీసి వాటిని ఆవిష్కరణలుగా మార్చి సమాజంలోని సమస్యలను పరిష్కరించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. మన చుట్టు పక్కల, ఇళ్లు, విద్యాలయాలు, వ్యవసాయం, ఇతర సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఆవిష్కరణలు చేయాలన్నారు. పూర్తి వివకరాలను 919100678543 వాట్సాప్ చేయాలన్నారు. ఆగస్టు 15న జిల్లా కలెక్టర్ సమక్షంలో ఆన్ లైన్‌లో ప్రదర్శింపబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఈ డిస్టిక్ మేనేజర్ సందీప్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి

- **జిల్లా ఎస్పీ బాలస్వామి**



నవతెలంగాణ-హవేలి ఘనాపూర్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి తెలిపారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్.పి డా.బి.బాలస్వామి ఆధ్వర్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారుల సమస్యలను వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ మండలం జానకంపల్లి గ్రామానికి చెందిన చరణ్ తన తల్లి, తండ్రి మరణించినారని నా తల్లి తండ్రులు ఒక ఎకరం పది గుంటలు భూమి కొని పట్టా చేసుకోలేదని నా తల్లి, తండ్రులు మరణించినారని ప్రస్తుతం మేము కాస్తులోనే ఉన్నామని అయినప్పటికి మాకు అట్టి పొలం అమ్మిన వారు ఈ పొలం మాదే అని దౌర్జన్యం చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్య తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్టప్రకారం ఫిర్యాదికి తగిన న్యాయం చేయమని మెదక్ రూరల్ సిఐని ఆదేశించారు. కామారెడ్డి జిల్లా పిట్లం గ్రామానికి చెందిన హన్మంత రెడ్డికి పెద్ద శంకరంపేట మండలం తిరుమాలపూర్ గ్రామ శివారులో సర్వే నెంబర్ 261/నందు 0-1250 గుంటల భూమిని తమ తాతల ద్వారా వంశపారంపర్యంగా వచ్చిందని ,ఈ భూమిలో మా పూర్వీకుల నుండి ప్రస్తుతం వరకు మేమే కబ్జాలో ఉన్నామని ఇట్టి భూమిని పెద్ద శంకరంపేట గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా మా భూమిని కబ్జా చేసి అట్టి భూమిలో బేస్మెంట్ వరకు నిర్మాణాన్ని చేపట్టినారని వారిపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ఫిర్యాదు చేయగా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు ఆదేశించారు.

తహశీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి



నవతెలంగాణ-మనోహరాబాద్

జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మనోహరాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణి కార్యక్రమానికి భూములకు సంబంధించిన ఆరు దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ప్రజవాణి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ నుంచి ఏవో స్రవంతి, డిప్యూటీ తహశీల్దార్ కౌశికారెడ్డి, ఆర్ఐ దీక్షిత్, రామారావ్ తదితరులు హాజరయ్యారు.



నవతెలంగాణ-మెదక్ టౌన్

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మెదక్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఫిర్యాదు దారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజావాణిలో డబల్ బెడ్ రూమ్‌ల కోసం 15 భూ సమస్యలపై 02 మీసేవ 0 మొత్తం 18 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి సోమవారం 10:30 నుంచి 2 గంటల వరకు ప్రజావాణి ఉంటుందని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘు తదితరులు ఉన్నారు.



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ గ్రేస్ బాయి సూచించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ధరణి సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ధరణిలో నెలకొన్న సమస్యలపై రైతులు తమ దరఖాస్తులను కార్యాలయంలో అందించాలని, వాటి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ తదితరులున్నారు.



నవతెలంగాణ-నిజాంపేట

స్థానిక తహశీల్దార్ కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించామని తహశీల్దార్ సురేష్ కుమార్ తెలిపారు. కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశాల మేరకు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1-00 గంట వరకు దరఖాస్తులు స్వీకరించామన్నారు. మండలంలోని గ్రామాల ప్రజలు వారి వారి సమస్యలను ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రాలు అందజేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గంగాధర్ గౌడ్, సీనియర్ అసిస్టెంట్ రమేష్, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీకాంత్ గౌడ్, శ్వేత, రవి, కార్యాలయ సిబ్బందిపాల్గొన్నారు.

కార్మికుల బిల్లులు వెంటనే విడుదల చేయాలి

- **మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలి**
- **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతి**



నవతెలంగాణ-మెదక్ టౌన్

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని మధ్యాహ్న భోజనం కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ కోరారు. ఈ మేరకు సోమవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 6 నెలల నుండి మధ్యాహ్న భోజనం కార్మికుల జీతాలు, 5 నెల బిల్లు పెండింగ్ ఉన్నాయన్నారు. వెంటనే వాటిని విడుదల చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే వేతనం విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి వంట చేసి పెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దీనితో కార్మికులు అప్పుల పాలు అవుతున్నారన్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర మంతటా గృహ లక్ష్మి పథకం పేరుతో గ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించి అమలు శ్రీకారం చుట్టింది మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అవసరమైయినా గ్యాస్‌ను సబ్సిడీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10,000ల వేతనం అమలు చెయ్యాలన్నారు. కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన యూనియన్ జిల్లా అధ్యక్షులు రూప్లీ, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి బాలవ్వ, లింగవ్వ, షబానా, శోహన, లావణ్య లక్ష్మి, నర్సమ్మ సుశీల తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే నిర్వహించిన జల జీవన్ మిషన్ అధికారులు



నవతెలంగాణ-నార్సింగి

మండలంలోని శేరిపల్లి గ్రామంలో జల్ జీవన్ మిషన్ అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు అందిస్తున్న త్రాగునీటి పథకాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన, సరిపడా త్రాగు నీరు అందించే లక్ష్యంతో సర్వే చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సర్వేలో భాగంగా నీటి నాణ్యత, క్లోరిన్ శాతం, ఫ్లోరైడ్ శాతాన్ని పరీక్షించారు. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలతో పాటు నీటి లభ్యత వివరాలు సేకరించారు. గ్రామంలోని ఇళ్లతో పాటు రెండు అంగన్వాడీ కేంద్రాలలో నీటి నమూనాలు తీసుకుని పరీక్షించారు. నీటి పరీక్షణలో పీహెచ్ లెవెల్, లవణాలు సరిపోయాయని, నీరు త్రాగడానికి బాగున్నాయని తేల్చారు. వానా కాలం కావడం వల్ల రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నందున నీటిని కాచి, వడబోసి తాగాలని, ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిలువ లేకుండా చూడాలని, తద్వారా వ్యాధులను నివారించ వచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఏ.ఈ స్వప్న, పంచాయితీ కార్యదర్శి నాగరాజు, జల్ జీవన్ ఫైల్డ్ అధికారి శ్రీను, ల్యాబ్ అసిస్టెంట్ శ్యామయ్య పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థలో దళిత పోలీసులకు రక్షణ కరువు

- **డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ డిమాండ్**



నవతెలంగాణ-నిజాంపేట్

దళితుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణపై అసెంబ్లీలో చర్చించాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం మండలం కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవెళ్ల ఎస్సీ ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత టీఆర్‌యస్ ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకం స్థానంలో అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని 12 లక్షలకు పెంచి అమలు చెస్తామన్న హామీ హామీగానే మిగిలిపోయిందన్నారు. ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక కమీషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ ఎస్టీలపై పెరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు చర్యలు తీసుకొవాలని కోరారు. దళిత పోలీసులపై దౌర్జన్యాలు రోజు రోజుకు మితిమీరుతున్నాయన్నారు. పోలీసు వ్యవస్థలో అగ్రవర్ణ పోలీస్ అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షులు దుబాసి సంజీవ్, తాజా మాజీ ఉపసర్పంచ్ కొమ్మట బాబు, మాల మహనాడు మండల ప్రచార కార్యదర్శి బండారి ఎల్లం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రసిడెంట్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-మనోహరాబాద్

రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలో పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున హాజరై ఘనంగా నిర్వహించారు. ముందుగా మండలంలోని కాళ్ళాకల్‌లోని బంగారమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు ప్రజలు బారీ సంఖ్యలో హాజరై ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకలకు మేడ్చల్ మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, మాజీ ఫుడ్స్ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి తదితరులు హజరై బారీ కేకును కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు పార్టీలకు అతీతంగా నాయకులు హజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్టారెడ్డి, నాయకులు కావేరిగారి భగవాన్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షులు నత్తి మల్లేష్ ముదిరాజ్, రాష్ట్ర నాయకులు బాషబోయిన చంద్రశేఖర్ ముదిరాజ్, జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పంచమి రేణుకుమార్, మండల ఉపసర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు మన్నె ధర్మెందర్, నాయకులు జావీద్‌పాషా, వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో సోమవారం వైద్య సిబ్బంది, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోగులకు వైద్య పరీక్ష నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణి చేశారు. ఈ శిబిరాని రెడ్డిపల్లి తాజా మాజీ ఉపసర్పంచ్ అశోక్ గౌడ్ సందర్శించి ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నిర్మల, సుప్రియ, దేవి, ఆశ వర్కర్లు జ్యోతి గ్రామస్తులు పాల్గొన్నారు.

వైయస్ఆర్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి

- **కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్**

నవతెలంగాణ-నర్సాపూర్

మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని చిల్డ్రన్ పార్కులో ఉన్న వైయస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ లలిత, మల్లేశం, హబీబ్ ఖాన్, ఉదయ్ కుమార్, సురేష్ నాయక్, నర్సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వేద సాగుతో అనేక లాభాలు



- మండల వ్యవసాయాధికారి

నవతెలంగాణ-మర్కుక్

వరిలో విత్తనం వెదజల్లే పద్ధతి ద్వారా రైతాంగానికి అనేక లాభాలున్నాయని మండల వ్యవసాయాధికారి టి.నాగేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన మర్కుక్‌లో వేద సాగు చేసిన రైతుల వరి పోలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... నారుమడి పద్ధతిలో ఎకరాకు 25 నుంచి 30 కేజీల విత్తనం అవసరం ఉంటుందన్నారు. వరినాటు కోసం కూలీలకు ఎకరానికి రూ.5వేల నుంచి రూ.6వేలు ఖర్చు అవుతుందని, వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేయడానికి ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనం మాత్రమే అవసరముంటుదని, కూలీల ఖర్చు అసలే ఉండదన్నారు.దీంతో ఎకరాకు రూ.6వేల నుంచి రూ.8వేల వరకు ఖర్చు మిగులుతుందన్నారు.ఎర్రవల్లిలో 50 ఎకరాల వరకు వేదసాగు చేస్తున్నరని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రజనీకాంత్, గ్రామ రైతులు,తదితరులున్నారు.

అంగన్వాడీ కేంద్రంలో బరువు మేళా



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలోని సోమవారం 5వ వార్డ్ అంగన్వాడీ కేంద్రంలో బరువుల మేళా నిర్వహించినట్టు వార్డు కౌన్సిలర్ వినోద్ గౌడ్ తెలిపారు.ఆయన మాట్లాడుతూ ఐదేండ్లలోపు పిల్లలందరికీ బరువులు, ఎత్తులు చూశారని, గ్రోత్ మేళాలో భాగంగా ఈసారి పిల్లలను కచ్చితమైన బరువులు, ఎత్తులను గుర్తించినట్టు తెలిపారు. పిల్లలు తక్కువ బరువు ఉంటే వారికి స్పెషల్ కేర్ తీసుకోమని చెప్పి, తక్కువ, అతి తక్కువ బరువు ఉన్న పిల్లలను ఈ కార్యక్రమంలో గుర్తించారని, తల్లులకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జ్యోతి, చంద్రకళ, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ పైన చర్యలు తీసుకోవాలి

- ఎస్.ఎఫ్.ఐ



నవతెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

ఐదు రోజుల క్రితం సురభి మెడికల్ కాలేజీలో ఫుడ్ పాయిజన్ అయి విద్యార్థులు హాస్పిటల్ లో అడ్మిట్అయ్యారని అందుకు గాను మెడికల్ కాలేజీ పైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సంధర్భంగా ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆముదాల రంజిత్ రెడ్డి, దాసరి ప్రశాంత్‌లు మాట్లాడ్తు రూ.1.50 లక్షల హాస్టల్ ఫీజు తీసుకుంటూ నాణ్యమైన భోజనంపెట్టకుండా నాసిరకమైన భోజనం పెడుతున్నారన్నారు.లక్షలల్లో ఫీజులు తీసుకుంటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుండా విద్యార్థులను తీవ్రమైన ఇబ్బందు లు గురిచేస్తున్నారని, ఎంబీబీఎస్ నర్సింగ్, జీఎన్ఎం విద్యార్థులకు హాస్టల్ ఫీజులు తీసుకొని కానీ వసతులు సరిగా లేకుండా అసంపూర్తి భవనం కుళ్లిపోయి కూరగాయలు కలిషితంగా అయినా నూనెను వాడుతున్నారు. కావునజిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్, నాయకులు చెప్యాల సంతోష్, తాడూరి భరత్ కుమార్, బత్తులఅభినవ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడికి తరలిన పంచాయతీ కార్మికులు



నవతెలంగాణ-మద్దూరు

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించి పెండింగ్లో ఉన్న జీతాలు చెల్లించాలని కోరుతూ సిద్దిపేట కలెక్టరేట్ ముట్టడికి గ్రామపంచాయతీ కార్మికులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి మద్దూరు గ్రామపంచాయతీ కార్మికులు సోమవారం తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో కారోబార్ మహేందర్, వాటర్ మ్యాన్ రఘు, ఎలక్ట్రిషన్ పరుశరాములు, కార్మికులు నరసయ్య, మల్లయ్య, అనసూర్య, వెంకటమ్మ, బాలమ్మ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయడంలో కాలయాపన



బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు

నవతెలంగాణ- గజ్వేల్

ప్రభుత్వం రుణమాఫీ చేయమంటే కాలయాపన చేస్తుందని, వెంటనే రుణమాఫీ చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు తహశీల్దార్‌కు కార్మికుల వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు ప్రతిపాదనలు అందజేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గజ్వేల్ బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు కర్ణాకర్, పంజాల బాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేనిఫెస్టో చెత్తబుట్టలో వేశారా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు గుర్తులేవా అని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పసల్ బీమా యోజన పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ఈ పథకం రైతులకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. ప్రతి రైతుకు రూ. 15 వేల ఆర్థిక సహాయాన్ని అందించాలని వారు కోరారు. వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ. 12 వేలు అందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మర్కంటి ఎగొండ, నత్తి శివకుమార్, మనోహర్, పంజాల అశోక్, శ్రీనివాస్, మల్లేష్ యాదవ్, రాజశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి, సందీప్, హిమగిరి అరవిందు, కృష్ణ గౌడ్, గుంటుకు రమేష్, నరేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-వర్గల్

వర్గల్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఒక స్వీపర్ పోస్ట్ ఖాళీగా ఉందని అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ ఆఫీసర్ రజిత సూచించారు.అర్హులైనవారు మహిళై వుండాలి, ఏడవ తరగతి చదివుండాలి. వారు తమ ఆధారకార్డు, స్టడీ సర్టిఫికెట్, బ్యాంక్ అకౌంట్ వివరాల జిరాక్స్ ప్రతులు జాతచేస్తూ ఈ జూలై 12వ తేదీ వరకు కేజీబీవీ వర్గల్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకై 9848133550 సంప్రదించాల్సిందిగా కోరారు.


ఘనంగా గ్రోత్ మేళా



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్‌లో ఐసీడీఎస్ సూపర్వైజర్ రేణుక ఆధ్వర్యంలో సోమవారం గ్రోత్ మేళ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టిన పిల్లల నుంచి మొదలు ఐదేండ్ల పిల్లల వరకు బరువు, ఎత్తు, జబ్బ చుట్టుకొలతలు తీసుకోన్నారు. అనంతరం సూపర్వైజర్ రేణుక మాట్లాడుతూ ఎదిగే వయస్సులో పిల్లలకు తప్పకుండా ప్రోటీన్స్ ఉన్న ఫుడ్ అందించాలన్నారు. ప్రతిరోజు అంగన్వాడీ లో ఇచ్చే గుడ్లను వాళ్లకు తినిపించాలని తెలిపారు. అంతేకాకుండా బాలామృతం ద్వారా వారికి ఎంతో శక్తి వస్తుందని, ఈ బాలమృతాన్ని ఇడ్లీలుగా తయారు చేసి పెడితే చాలా ఇష్టంగా తింటారని తెలిపారు. అంతేకాకుండా తప్పనిసరిగా గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారాన్ని తినాలని, దీనివల్ల బిడ్డ గ్రోత్ పెరుగుతుందని తెలియజేశారు. అలాగే బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీటీసీ సాంబరాజు, పంచాయతీ సెక్రెటరీ, హెల్త్ సూపర్వైజర్, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరిక




నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు లక్కిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశం ,జిల్లా నాయకులు కామిడీ జీవన్ రెడ్డి, జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డిల ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చూసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి బూరుగు శంకర్ గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ కాటం బాలయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎఫ్ఎం షౌకత్ అలీ, నాయకులు రామడుగు బాలరాజు, పసిహమ్మద్, కనక చంద్రం, తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించండి

- కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య



నవతెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో కొత్త కాలనీలకు నిధులు కేటాయించాలని మున్సిపల్ 15 వార్డు కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య కోరారు. సోమవారం తన ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మున్సిపాలిటీలో కొన్ని రోడ్లు పూర్తి చేసినప్పటికీ కొత్త కాలనీలో చాలా రోడ్లు పెండింగ్లో ఉన్నాయని వాటికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయించి రోడ్లు పూర్తి చేయాలన్నారు. రోడ్లు లేకపోవడం వల్ల ప్రజలకు రాకపోకలకు ఇబ్బంది అవుతుందని పేర్కొన్నారు. తగిన నిధులు లేకపోవడం వల్ల రోడ్లు పూర్తి చేయలేకపోయామని అన్నారు. గత ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి మంత్రి హరీశ్ రావు కృషితో కొన్ని రోడ్లు పూర్తి చేసినట్టు గుర్తు చేశారు. మున్సిపల్‌లోని లక్ష్మీ ప్రసన్న నగర్, సిరికేనులు,, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో ఇంకా రోడ్లు చాలా వరకు ఉన్నాయని మరికొన్ని టెండర్ పూర్తి చేసినప్పటికీ పనులు చేస్తే బిల్లులు వస్తాయో రావని కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.కాబట్టి ప్రభుత్వం వారికి భరోసా ఇచ్చి పనులు చేయించాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, మంత్రులు స్పందించవలసిన అవసరం ఉందన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సంద బోయిన ఎల్లయ్య,
- జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్
- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి
- జీతాలు చెల్లించకుంటే నిరవధిక సమ్మె చేస్తాం





నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీ సిబ్బందికి గత పది నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని, లేనియెడల గ్రామపంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మెలో ఉంటారని సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ హెచ్చరించారు. వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్‌ను ముట్టడించారు. దాని ముందు ఉంచిన భారీ కేడ్లను తొలగించుకొని గేట్లు ఎక్కే ప్రయత్నించగా పోలీసులు సర్ది చెప్పారు. అనంతరం కలెక్టర్ మను చౌదరి జోక్యం చేసుకొని వారం లోపల సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం కలెక్టర్ కి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ జిల్లాలో 499 గ్రామపంచాయతీలు ఉండగా, అందులో సుమారు 2500 మంది కార్మికులు పనిచేస్తున్నారని, వారికి గత పది నెలల నుంచి జీతాలు పెండింగ్‌లో ఉండడం మూలంగా తమ కుటుంబాలను గడపడం కష్టంగా మారిందని అన్నారు. అప్పులు చేసి మరి కుటుంబాన్ని గడపాల్సి వస్తుందని, ఈ సమస్యలు పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలు చెల్లించకుంటే జిల్లా వ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేసి, సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.5 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి, పాత కేటగిరీలను కొనసాగించాలని కోరారు. గ్రామాలలో పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్స్, డంపింగ్ యార్డ్స్, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠ ధామాలు తదితర పనుల్లో నిత్యం శ్రమిస్తూ, గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా ప్రజలకు సేవలందిస్తున్నారని అన్నారు. వీరిలో అత్యధికులు దళితులు, బలహీన వర్గాలకు చెందిన పేద కార్మికులు ఉన్నారని, సంవత్సరాల తరబడి విధులు నిర్వహిస్తున్నా నేటికీ పర్మినెంట్ కు నోచుకోలేదని అన్నారు. గ్రామ పంచాయతీలలో ప్రజల అవసరాల మేరకు అదనంగా కార్మికులను నియమించి వారికి వేతనాలు చెల్లించడం లేదని, ఈ వేతనాలు కూడా నెలల తరబడి ఇవ్వకపోవడంతో అర్థాకలితో, అప్పులు చేసుకుని బతకాల్సిన పరిస్థితుల్లో పంచాయితీ కార్మికులున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన హామీలు అమలు చేయాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, కార్మికుల పెండింగ్ వేతనాల చెల్లించాలని తదితర సమస్యలకు పరిష్కారానికి మార్గం చూపాలని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అమ్ముల బాలార్సయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈ ముట్టడిలో యూనియన్ జిల్లా కార్యదర్శి తునికి మహేష్, యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొమురయ్య, కోశాధికారి రాజనర్సు, గ్రామపంచాయతీ కార్మికులు శంకరయ్య, రాజమల్లు, మల్లయ్య, సమ్మయ్య, నరసింహులు, రవీందర్, కనకయ్య, ఎల్లయ్య, బాబురావు, ప్రభాకర్, వివిధ గ్రామాల గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

సొంత నియోజకవర్గాలకే పరిమితమవుతున్న మంత్రులు





నవతెలంగాణ -గజ్వేల్

మంత్రులు రాష్ట్రానికి బాధ్యత వహించవలసింది పోయి తమ సొంత నియోజకవర్గాలకే పరిమితం అవ్వడం ఇతర నియోజకవర్గాల ప్రజలను అనేక సమస్యలు, ఇబ్బందులకు గురిచేస్తుంది.గజ్వేల్‌ను పట్టించుకునేవారేవరు, పెండింగ్ పనుల పూర్తి చేయరా, స్థానిక ప్రజల గోడువినరా,ఎన్నో ఆశలతో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్న ప్రజలకు పాలకవర్గాలు న్యాయం చేయడం లేదనే అభిప్రాయం ప్రజల్లో పెరుగుతుంది. స్థానికంగా ఏర్పడిన సమస్యల పరిష్కారం కోసం, పెండింగ్ పనుల పూర్తి కోసం పలు నియోజకవర్గాల్లో పట్టించుకునే వారి కరువయ్యారు. దీంతో ప్రజలు తీవ్ర సమస్యల గురవుతున్నారు.గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలో నిలిచిపోయిన బస్టాండ్ పరిస్థితిని ఈ జిల్లాకు చెందిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఎందుకు పట్టించుకోవడంలేదు. పాత నిధులే మళ్లీ రికవరీ చేసి పనులు పూర్తి చేస్తే బస్ స్టాండ్ సమస్య తీరుతుంది. మంత్రి ఎందుకు చేయడం లేదు . దాంతో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ప్రయాణికులు ఇబ్బందులు గురవుతున్నారు. ప్రజ్ఞాపూర్ నుంచి వెళ్తున్న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి నిలిచిపోయిన బస్టాండు నిర్మాణాలు కనిపిస్తలేవా. కనిపించిన నేనెందుకు పట్టించుకోవాలి అనుకుంటున్నారా.!

అదేవిధంగా జిల్లాకు ఇన్చార్జిగా, మంత్రిగా పనిచేస్తున్న కొండ సురేఖ గజ్వేల్ పట్టణంలో ఇందిరా పార్క్ రోడ్డును పూర్తి చేసే పనులను ఎందుకు పట్టించుకోరు. గజ్వేల్ పాత ఎంపీడీవో కార్యాల వద్ద మురికికుంటగా మారడటం వల్ల అక్కడ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు అనేకసార్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి దృష్టికి తీసుకుపోయారు. నిధులు లేవు అని చేతులెత్తేస్తున్నారు. అక్కడ నివసిస్తున్న ప్రజల పరిస్థితి ఏమిటి. వారి ఆరోగ్యం సమస్యలకు బాధ్యులెవరు. అదేవిధంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చుట్టూ 22న కిలోమీటర్ల రింగ్ రోడ్డును గత ప్రభుత్వం చివరి దశకు తెచ్చినప్పటికి మిగిలి కొంత పనిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పూర్తి చేస్త లేదు. శిలాఫలకంపై పేర్లు ఉండయని అనుకుంటున్నారా ఇన్చార్జి మంత్రి కొండ సురేఖ. అంతేకాకుండా డబుల్ బెడ్ రూమ్ విషయంలో మంత్రి ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని గజ్వేల్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నిలిచిపోయిన అభివృద్ధి పనులు

సుమారు రూ. 8 కోట్ల నిధులతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్ పట్టణాల్లో నిర్మిస్తున్న బస్టాండు అర్ధాంతరంగా నిలిచిపోయింది. స్లాబ్ వేసినప్పటికీ మిగతా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత కాంట్రాక్టర్‌కు నిధులు రాకపోవడంతో పనులను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు గురవుతున్నారు.

రింగ్ రోడ్డు దుస్థితి.

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ చుట్టూ 22 కిలోమీటర్ల రింగ్ రోడ్డు పరిస్థితి ఇదే దుస్థితి. సుమారు. రూ.240 కోట్లు కేటాయించి రోడ్డు పనులు చివరి దశలో నిలిచిపోయాయి. ఒకటి సంగాపూర్ వద్ద, మరొకటి రైల్వే జంక్షన్ వద్ద రోడ్డు పూర్తి చేస్తే రింగ్ రోడ్డు పూర్తవుతుంది.

కోట మైసమ్మ రోడ్డు పరిస్థితి.

స్థానిక ఇందిరాపార్క్ నుంచి ఢిల్లీ వాలా హెూటల్ వరకు పూర్తి చేశారు. అక్కడి నుంచి మురికి కాలం నిర్మాణం లేకపోవడం వల్ల పాత ఎంపీడీవో కార్యాలయం వద్ద మురికికుంటగా మారింది. రోడ్డు నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన వారికి ఇల్లు ఇస్తామంటే వెంటనే మురికి కాలువ తవ్వకాలకు అనుమతి వస్తుంది. దీనిపై మంత్రులు పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. గతంలో మంత్రిగా పనిచేసిన హరీశ్ రావు సైతం సిద్దిపేటకు పరిమితమయ్యారు. ఇప్పుడున్న కాంగ్రెస్ మంత్రులు సైతం వారి సొంత నియోజకవర్గాలకు పరిమితం అవుతున్నారని విమర్శలు వస్తున్నాయి. గతంలో హరీశ్ రావు అడపాదడపా గజ్వేల్‌కు వచ్చినప్పటికీ అభివృద్ధి విషయంలో పట్టించుకోకపోవడం వల్లే నేడు ఈ దుస్థితికి ఉండేందుకు హరీశ్‌రావు ముఖ్య కారణం అని స్థానికులు విమర్శిస్తున్నారు

ఘనంగా వైయస్సార్ జన్మదిన వేడుకలు

















నవతెలంగాణ-మద్దూరు

మద్దూరు మండల కేంద్రంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, జిల్లా నాయకులు కామిడీ జీవన్ రెడ్డి, జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి బూర్గుశంకర్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎఫ్ఎం షౌకత్ అలీ, పీఏసీఎస్ డైరెక్టర్ కాటం బాలయ్య, నాయకులు రామడుగు బాలరాజు, బొడికే భీమయ్య, పసి మొహమ్మద్, కనక చంద్రం, నీరటి కిషోర్, ఎండి నవీద్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -నంగునూరు

స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి 75 వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ అభిమాన సంఘం నాయకుడు ఎండీ.ఇమాన్ ఆధ్వర్యంలో మగ్దంపూర్ లో వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి, నంగునూరు మండల కేంద్రంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఇమాన్ మాట్లాడుతూ వైఎస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కనీవినీ ఎరుగని రీతిలో వినూత్న సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. హరితాంధ్రప్రదేశ్ సృష్టికర్త, జలయజ్ఞ అపార భగీరథుడు, విద్య ఉద్యోగ దాత, ఆరోగ్య ప్రదాత, పేదల పెన్నిధి, బడుగుబాలహీన వర్గాల ఆశాజ్యోతి, సంక్షేమ సారధి, వైఎస్సార్ భౌతికంగా మన మధ్యలో లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. వైఎస్సార్ అందించిన సేవలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండడం గర్వ కారణం అని చెప్పారు.ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్, 108,104, ఇందిరమ్మ గృహాలు చెప్పుకుంటూ పోతే అనేక సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత వైఎస్సార్ కే దక్కిందన్నారు.ఈ కార్యక్రమాల్లో బడే అశోక్, బోజు రాములు, బడుగు సదానందం, బొజ్జ గోపీ, రాంరెడ్డి, బాలరాజు, జంపులు, అల్లెపు కుమార్, రాములు,పాలెపు కనకయ్య గౌడ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ- హుస్నాబాద్ రూరల్

పేద బడుగు బలహీన వర్గాల కోసం పనిచేసి ప్రజల మనసులో మహనీయునిగా నిలిచిన గొప్ప వ్యక్తి వైయస్ రాజశేఖర్ రెడ్డి అని పీసీసీ సభ్యులు కేడం లింగమూర్తి అన్నారు. సోమవారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ పుట్టినరోజు వేడుకలు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు హుస్నాబాద్ నియోజకవర్గంలోని గండిపల్లె గౌరవెల్లి ప్రాజెక్టుతో పాటు తోటపల్లి రిజర్వాయర్ కూడా ఫౌండేషన్ చేశాడన్నారు. పేద ప్రజల యొక్క బాధలు తెలుసుకున్న నాయకుడిగా 104.108ఆరోగ్యశ్రీ, అలాంటి పథకాలు పెట్టారన్నారు.రైతులకు ఉచిత కరెంటు రూ. లక్ష రుణమాఫీ ఇచ్చిన నాయకుడన్నారు. నిత్యం పేద ప్రజల కోసం పనిచేసిన రాజశేఖర్ రెడ్డి సేవలు మరువలేనివని కొనియాడారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు ,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ ,కౌన్సిలర్స్ వల్లపు రాజు, భూక్య సరోజన, కోమటి స్వర్ణలత సత్యనారాయణ, పున్నసది లావణ్య, ఎండి. హసన్, వెన్న రాజు,బోంగొని శ్రీనివాస్, పోలు సంపత్ పాల్గొన్నారు.

నవతెలంగాణ -ములుగు

దివంగత నేత, ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి, సంక్షేమ పథకాల పితామహుడిగా పేరుగాంచిన నేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి 75వ జన్మదిన సందర్భంగా వంటిమామిడి మార్కెట్ దగ్గర ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు తమ్ముల శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు కొండు నరసింహులు, వర్గల్ మాజీ ఎంపీపీ మోహన్, బండ నర్సంపల్లి మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, సింగన్నగూడెం మాజీ సర్పంచ్ రవి, ప్రభాకర్ గుప్తా, ఐలయ్య యాదవ్, గౌరారం నవీన్‌లు పాల్గొన్నారు

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ఉమ్మడి రాష్ట్ర దివంగత మాజీ సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలను గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ లో సోమవారం కాంగ్రెస్ నాయకులు వైఎస్ఆర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేసిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి దక్కుతుందన్నారు. జనాల హృదయానికి జననేతగా పేరుగాంచిన వైయస్ రాజశేఖర్ రెడ్డి అకాల మరణం చెందడం చాలా బాధాకరమన్నారు. రాజకీయ ప్రస్తావన యువజన కాంగ్రెస్ కార్యదర్శిగా ప్రారంభించి అంచెలంచులు గా ఎదిగి రెండుసార్లు పీసీసీ అధ్యక్షులుగా ప్రతిపక్ష నేతగా, ముఖ్యమంత్రిగా ఎన్నో సేవలు అందించారన్నారు.ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఎండలో 1467 కిలోమీటర్ సుదీర్ఘ పాదయాత్ర చేసి ప్రజా సమస్యలను తెలుసుకున్న ప్రజానాయకుడు వైయస్సార్ అన్నారు.ముఖ్యమంత్రిగా తొలి సంతకం ఉచిత విద్యుత్ పై పెట్టి, రైతు రుణమాఫీ చేసి రైతు నాయకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఆరోగ్యశ్రీ, 108 ,104, నిరుపేదలకు వైద్యానికి దగ్గర చేసిన వ్యక్తి వైఎస్ఆర్ విద్యార్థులకు ఫీజ్ రియంబర్స్‌మెంట్ ఇచ్చి, విద్యదాతగా నిలిచారన్నారు. వృద్ధులకు రూ. 75 పెన్షన్ ను రూ.200 చేసినా ఘనత వైఎస్ఆర్ కి దక్కుతుందన్నారు.పతి నాలుగు నెలలకు ఒకసారి ప్రజల వద్దకు వెళ్లే విధంగా ప్రజాపథం, రచ్చబండలతో గ్రామ సమస్యలను తెలుసుకొని గ్రామ సభలు పెట్టి పరిష్కారానికి మార్గం చూపెట్టరన్నారు. హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం చెంది మనకు దూరమైన ఆయన ఆశయాలకు ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. రాహుల్ గాంధీని దేశ ప్రధాని చేయాలని ఆయన ఆశయ సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కంకణ కట్టుకొని పని చేద్దామన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు సర్దారఖాన్, మతిన్, నక్క రాములు గౌడ్, షరీఫ్, యాదగిరి, లక్ష్మణ్, నాగరాజు, అంజగౌడ్, సత్యం, గంగిశెట్టి రాజు, యునుస్, రాజు, కొమ్ము ఉమేష్ యాదవ్, పాల్గొన్నారు.

నవ తెలంగాణ - సిద్దిపేట

వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలు సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరి కృష్ణ, జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు బొమ్మల యాదగిరి, పట్టణ అధ్యక్షులు అత్తు ఇమామ్, సీనియర్ నాయకులు గంప మహేందర్ రావు, మహిళా జిల్లా అధ్యక్షులు లక్ష్మీ, కలీముద్దీన్, మార్క సతీష్, తప్పట శంకర్, షాబుద్దీన్, మంద పాండు, వాహబ్, కొంగ సాంబమూర్తి, అజమత్, గియాసుద్దీన్, మహిపాల్ రెడ్డి, ఎర్రబోలు రాజి రెడ్డి, ఎర్ర మహేందర్, జనార్ధన్ రెడ్డి, చెంది రెడ్డి అంజి రెడ్డి, గుర్తం అంజిరెడ్డి, మల్లారెడ్డి, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుబ్బాక

దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.రాజశేఖర్ రెడ్డి చిరస్మరణీయుడని, ఆయన పాలనలో సబ్బండ వర్గాలకు న్యాయం జరిగిందని కాంగ్రెస్ దుబ్బాక మండల అధ్యక్షుడు కొంగర రవి అన్నారు.సోమవారం వైయస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి సందర్భంగా దుబ్బాక మండల పరిధిలోని సీఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి భారీ కేకును కట్ చేసి పంచిపెట్టారు.అనంతరం ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు.దుబ్బాక పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిది మచ్చ శ్రీనివాస్,మున్సిపల్ అధ్యక్షుడు నర్మేట ఏసురెడ్డి, సీనియర్ నాయకులు ఉషయ్యగారి రాజిరెడ్డి, పలువురు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూర్మ ఆగంరెడ్డి, కొమురవెల్లి దేవస్థానం కమిటీ మాజీ చైర్మన్‌లు ఆడెపు చంద్రయ్య, ముస్త్యాల కిష్టయ్య, కౌన్సిలర్ ఆడెపు నరేందర్, నాయకులు దాసరి శ్రీకాంత్, బండెల మహిపాల్ రెడ్డి, ఎండీ. జౌర్, కాటం శ్రీనివాస్, పచ్చిమడ్ల వెంకటయ్య, తుమ్మలపల్లి శ్రీనివాస్, నీలం సన్నీ, బడేమియా,పోతుగంటి ప్రసాద్, అంబాల బుచ్చిరాములు, అంబాల శ్రీనివాస్, వంగపల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి రమేష్ పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల పరిశీలన



నవతెలంగాణ -నంగునూరు

నంగునూరు మండలం రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజనీరింగ్ ప్రవేశాల కొరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొనసాగుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సూర్య నారాయణ తెలిపారు.చెప్పారు.ఈ నెల 10వ తేదీ వరకు సర్టిఫికేట్ పరిశీలన కొనసాగుతుందని, సోమవారం నిర్వహించిన కౌన్సెలింగ్ కు 474 మంది హాజరయ్యారన్నారు. నితిన్ పవార్, మాణిక్యం,సీ హెచ్.శ్రీనివాస్, రాజు, సంధ్యా రాణి, కవిత, జ్యోతి, విజయ్ కుమార్, శ్రీనివాస్, రాజమౌళి, స్వామి, వాణి తదితరులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేశారు.

డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన కమిషనర్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను సోమవారం మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌లో మొక్కల పెంపకం, తడి, పొడి చెత్తను వేరు వేరు చేసే కంపోస్ట్ షెడ్డును పరిశీలన చేశారు. డ్రై రిసోర్స్ సెంటర్‌ను సైతం పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీధర్ రెడ్డి, సానిటర్ ఇన్స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జేబు దొంగల చేతివాటం

నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలోని పాత బస్టాండ్‌లో జేబు దొంగలు సోమవారం తమ చేతివాటాన్ని చూపించారు. హనుమకొండకు వెళ్లే బస్సులో ఇద్దరు ప్రయాణికుల నుంచి పర్సులను దొంగిలించినట్టు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రయాణికుని పర్సులో సుమారు రూ. 15వేలు, మరో ప్రయాణికుని పర్సులో రూ.2వేలు ఉన్నట్టు తెలిపారు. డబ్బులతో పాటు విలువైన ఐడి కార్డులు, పత్రాలు పోయినట్టు బాధితులు వాపోయారు. బస్టాండ్‌లో బస్సులు ఎక్కి, దిగేముందు ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎలాంటి అనుమానాలు ఉన్న బస్టాండులో ఉండే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవ తెలంగాణ - కొండపాక



కుక్కునూరు పల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 2014 -15 వ ఏడాది పదో తరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకుంటూ ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఉత్సాహంగా గడిపారు అనంతరం. వారికి విద్యా బుద్ధులు నేర్పిన ప్రధానోపాధ్యాయుడు నాగరాజు ఉపాధ్యాయులు శ్రీనివాస్ ,రవి కిరణ్, రామచంద్రారెడ్డి ,మల్లేశం ,జనార్దన్, కనక లక్ష్మీలను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారు

నోట్ బుక్స్ అందజేత

- డి. రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల పట్టణ కేంద్రంలోని పెద్దమ్మ గడ్డ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న డి. రాకేష్ రెడ్డి తమ సొంత గ్రామం కమలాయపల్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు సోమవారం నోట్ బుక్స్,పెన్నులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు రాకేష్ రెడ్డిని అభినందించారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కౌన్సిలర్ తోడేటి నవీన్

నవతెలంగాణ- ములుగు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని, ఎన్నో బీమా పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ములుగు అంగన్వాడి పాఠశాలలో గర్భిణీలకు, బాలింతలకు ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్ తోడేటి నవీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ చింతకింది సుశీల పాల్గొన్నారు

పాము కాటుతో గేదె మృత్యువాత

నవతెలంగాణ-చేర్యాల



పాము కాటుతో గేదె మృత్యువాతకు సంఘటన చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామంలోని పోలోజు కృష్ణమూర్తికి చెందిన గేదె తన వ్యవసాయ పొలం వద్ద మేత మేస్తుండగా పాము కాటుకు గురై మృతి చెందిందని, గేదె విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని తమను ఆదుకోవాలని బాధితుడు ప్రభుత్వాన్ని వేడుకున్నాడు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- బీజేపీ నాయకులు


నవ తెలంగాణ- కొమురవెల్లి



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మండల ప్రధాన కార్యదర్శి ఎక్కడ దేవి మధు మాట్లాడుతూ రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయాలని, ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా, రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు, రైతులు పండించే పంటలకు ఫసల్ బీమా,రూ.4 వేల పెన్షన్, మహిళలకు రూ. 2500, లాంటి పథకాలను ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసి ఆరు నెలలు గడిచిపోయిన అమలు చేయడం లేదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకులు బచ్చల చంద్రం, నాయకులు గుర్రాల రాములు, కటకం అమర్, మండల ఉపాధ్యక్షులు బ్రాహ్మణలపల్లి బాబు, మండల యువ మోర్చా అధ్యక్షులు సానాది కర్ణాకర్, బూత్ అధ్యక్షులు రమణారెడ్డి, స్వాములపల్లి శ్రీనివాస చారి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృత్యువాత

నవతెలంగాణ - కొమురవెల్లి



విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృత్యువాతకు గురైన ఘటన సోమవారం మండలంలోని రాంసాగర్ లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రోజులాగే ఆవు మేతకు వదిలారని ట్రాన్స్ ఫార్మర్ పక్కన మేత మేస్తుండగా షాక్ కు గురై ఆవు అక్కడికక్కడే మృతి చెందిందని, రోజు 15 లీటర్ల పాలు ఇచ్చే ఆవు సుమారు రూ.90 వేల విలువ ఉంటుందని, ఆవు మృతి తో రైతు తీవ్రంగా నష్టపోయాడని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు

వాసవి యూత్ క్లబ్‌కు అవార్డు

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట వాసవి యూత్ క్లబ్ చేస్తున్న సేవలను గుర్తించి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఆర్. రవిచంద్రన్ స్టార్ క్లబ్ అవార్డులను యూత్ క్లబ్ అధ్యక్షులు హరి కిరణ్‌కు అందించినట్టు క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గంప శ్రీనివాస్ తెలిపారు. సోమవారం గంప శ్రీనివాస్ మాట్లాడుతూ ఒంగోలులో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ అవార్డును అందించినట్లు తెలిపారు.వాసవి క్లబ్ యూత్ సిద్దిపేట ఎన్నో సేవా కార్యక్రమాలు చేసి స్టార్ క్లబ్ అవార్డు తీసుకోవడం చాలా సంతోషమని, ఇలా మరెన్నో కార్యక్రమాలు చేస్తూ, సిద్దిపేట వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ లో ఎన్నో అవార్డులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ భానూరి నర్సింలు, క్యాబినెట్ ట్రెజరర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ఎం. మను చౌదరి



నవ తెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల అర్జీదారుల నుంచి జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చేసి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చేసిన ప్రజల నుంచి మొత్తం 31 దరఖాస్తులు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజావాణిలో భూమి సమస్యలపై ఎక్కువ ఫిర్యాదు వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నాగ రాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా , ఇతర జిల్లా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచి ఒక ఇన్నోవేటర్ తయారు కావాలి

నూతన ఆవిష్కరణలకు సిద్దిపేట జిల్లా వేదికగా నిలవాలని కలెక్టర్ సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై పోస్టర్ రిలీజ్ చేసి, చదువు వయస్సుతో పనిలేదని, ప్రతి ఒక్కరూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. విద్యాశాఖ అధికారులతో పాటు పలు శాఖల అధికారులు పాఠశాలలతో పాటు గ్రామాల్లో ఈ కార్యక్రమం పై విస్తృతంగా అవగాహన



కల్పించాలని పేర్కొన్నారు. ఈ ఏడాదిలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు ఆవిష్కరణలతో తమ ప్రతిభకు పదును పెట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నదని పేర్కొన్నారు. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణుల ఆవిష్కరణ, విద్యార్థుల ఆవిష్కరణ, వ్యవసాయ రంగ ఆవిష్కరణలు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలతోపాటు తదితర ఆవిష్కరణలను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. వాటికి సంబంధించిన ప్రదర్శనకు గల రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫోటోలు, 100 పదాలతో రాసి ఆసక్తి గల వారు తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్ 9100678543 కు పంపాలని సూచించారు. వృత్తి, ఊరు పేరు, జిల్లా పేరుతో వివరాలతో ఆగస్టు 5వ తేదీలోగా పంపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, ఈడీఎం ఆనంద్, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల గ్రోత్ మేళా

- పౌష్టికాహారంతోనే మంచి ఫలితం

నవతెలంగాణ-తొగుట



తొగుటలో

పిల్లలకు పౌష్టికాహారంతోనే మంచి ఫలితం ఉంటుందని, వారిని పౌష్టికాహారం లోపానికి గురి కాకుండా ఉండేందుకు తల్లిదండ్రులు సహకరించాలని అంగన్వాడీ టీచర్లు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని 1 నుంచి 4 అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గ్రోత్ మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్లు మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలం దరిని అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. వారికి అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అందుతుందన్నారు. పిల్లలు వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు గుర్తించి తల్లులకి వివరించి చెప్పినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్యామల, ఏఎన్ఎం రజిని, అనురాధ, టీచర్లు అనిత, విజయ, మాధవి, వసంత, ఆశా కార్యకర్తలు లావణ్య, కవిత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యలయంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది చిన్నారుల గ్రోత్ మేళా సోమవారం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఎత్తు, బరువు మేళాను నిర్వహించి ఎత్తుకు తగిన బరువు ఉంటేనే చిన్నారులు ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంఈఎం హెచ్‌వీ సులోచన తల్లిదండ్రులకు సూచించారు. పంచాయితీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి, ఎస్ఎం అనిత, అంగన్వాడీ ఉపాధ్యాయులు జయలక్ష్మీ భూదేవి, కనకలక్ష్మీఆశాలు బాగ్యలక్ష్మీ,సౌమ్య, వెంకటలక్ష్మీ,రేణుక,రజిత,రజిని పాల్గొన్నారు.



బెజ్జంకిలో

నవ తెలంగాణ- సిద్దిపేట అర్బన్



సిద్దిపేట అర్బన్‌లో

సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలలో సోమవారం గ్రోత్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం పద్మావతి, పంచాయతీ కార్యదర్శి గీత అంగన్వాడీ కేంద్రానికి వచ్చే తల్లులకు గర్భవతులకు, బాలింత లకు గ్రోత్ మేళా పై అవగాహన కల్పించారు. పిల్లలకు పౌష్టిక ఆహారాన్ని అందించేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్స్ సరోజన ,లతా, లావణ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు


నవతెలంగాణ - కొండపాక

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద , కుకునూరు పల్లి బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, విరుపాక శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశం, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పర్శరాములు, ఎస్‌సీ సెల్ కొమ్ము మల్లికార్జున్, మాజీ ఎంపీపీ అనసూయ కనకరములు,దుద్దెడ తాజా మాజీ సర్పంచ్ మహదేవ్, పీఏసీఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్, చిరంజీవి, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మెరుగు ప్రభాస్, ఎన్ఎస్‌యూ ఐ అధ్యక్షుడు త్రినేష్ తదితరులు పాల్గొన్నారు.



కొండపాకలో

నవ తెలంగాణ- దుబ్బాక



దుబ్బాకలో

దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్ .రాజశేఖర్ రెడ్డి నేతృత్వ ంలోని కాంగ్రెస్ సర్కార్ హయాంలో రైతు కష్టాల పైనే తొలి సంతకం చేశారని, వైయస్ రాజశేఖర్ రెడ్డి రైతు బాంధవుడు అని, ఆయన సేవల్ని యావత్ తెలుగు రైతాంగం మరిచిపోదని కాంగ్రెస్ దుబ్బాక బ్లాక్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ పేర్కొన్నారు. సోమవారం వైయస్ రాజశేఖర్ రెడ్డి 75 వ జన్మదిన సందర్భంగా అక్బర్ పేట భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో అక్బర్ పేట భూంపల్లి తాజా మాజీ ఎంపీటీసీ అబ్బుల ఉమారాణి బాలా గౌడ్, బేగంపేట తాజా మాజీ సర్పంచ్ అనసూయ ప్రతాప్, మాజీ టెలికాం బోర్డ్ నెంబర్ పాతూరి శ్రీనివాస్ గౌడ్,మండల ఉపాధ్యక్షుడు ముత్తంగి భూమయ్య, మండల మహిళా అధ్యక్షురాలు కూతురి సుమలత, మండల సేవా దళ్ అధ్యక్షుడు పాతూరి భూపాల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొమ్మెర శ్రీధర్,బాల్తే వెంకటేశం,అక్బర్ పేట గ్రామ అధ్యక్షుడు కూతురి చందు,భూంపల్లి గ్రామ అధ్యక్షుడు ఎల్లన్నగారి సురేందర్ రెడ్డి, తాళ్లపల్లి గ్రామ అధ్యక్షుడు వేల్పుల యాదగిరి ముదిరాజ్, చిట్టాపూర్ గ్రామ అధ్యక్షుడు తీగల స్వామి గౌడ్, నాయకులు షేర్ పల్లి స్వామి, పార యాదగిరి, కడవేర్గు స్వామి,గడ్డం యాదగిరి,సిద్దిని రాజు,నగరం నారా గౌడ్ పాల్గొన్నారు.

నవతెలంగాణ -నంగునూరు



నంగునూరులో

దివంగత మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలు ఇప్పటికీ కూడా పేద ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ చెలికాని యాదగిరి యాదవ్, బీసీ సెల్ మండల అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాగుల కృష్ణ, దేవులపల్లి చింటు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఐలయ్య మాట్లాడుతూ పేద ప్రజలకు గుండెచప్పుడు వైఎస్ఆర్ అని అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆరోగ్యశ్రీ, ఫీజ్ రియంబర్స్మెంట్, ఇందిరమ్మ ఇల్లు రైతులకు, ఉచిత విద్యుత్,రైతులకు ఏకకాలంలో రుణమాఫీ, మహిళా సంఘాలకు పావల వడ్డీ రుణాలు అందించారన్నారు. తదనంతరం తాజా మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు వృద్ధులకు, వితంతులకు పెన్షన్స్, జలయజ్ఞం, ఉపాధి హామీపథకం,ఉద్యోగ ఉపాధి కల్పన ఇలా ఎన్నో సంక్షేమ తీసుకువచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ బద్దం రాజిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు చింతల మల్లారెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు కొత్తకొండ పోశెట్టి, బీసీ సెల్ అధ్యక్షులు చింతల బాలరాజు, ఎస్టీ సెల్ అధ్యక్షులు కరెంటోత్ రవి, ఎస్సీ సెల్ అధ్యక్షులు బెజ్జంకి సారయ్య, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నకీర్తి మునిరాజ్, అక్కన్నపేట మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ పంగ రాకేష్ మాజీ సర్పంచ్ కాశబోయిన ఎల్లయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు లింగంపల్లి సారయ్య, హనుమాన్ల రాజిరెడ్డి, చందర్, కాంగ్రెస్ నాయకులు కొలిపాక అశోక్, స్వామి, వింజపల్లి రాజు, గుగులోతు రాజు, నకీర్తి రాజయ్య, గూగులోత అర్జున్, తంగళ్ళపెల్లి పర్శయ్య, లింగాల శాంతయ్య, కాశ బోయిన సంపత్, టేకుల వెంకట రాజం, గంగారపు కొమురయ్య, పాల్గొన్నారు.



అక్కన్నపేటలో

నవతెలంగాణ-కోహెడ



కోహెడలో

కోహెడ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడిన వ్యక్తి అని, 108 ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్ లాంటి ప్రజా సంక్షేమ పథకాలతో ప్రజల మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో శెట్టి సుధాకర్, వేల్పుల వెంకటస్వామి, లక్ష్మణ్, పాము శ్రీకాంత్, తిరుపతిరెడ్డి, బండిపల్లి నారాయణ, దూలం శ్రీనివాస్, చింతకింది శంకరయ్య, గాజె శ్రీధర్, భైరి సుధాకర్, నంగునూరి శ్రీనివాస్, వెల్దండి సతీష్, రాజిరెడ్డి, రవి, శ్రీనివాస్, లక్ష్మణ్, సత్యనారాయణ, చాంద్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితో ట్రిపుల్ ఐటీలో సిద్దిపేట టాప్

- బీఆర్ఎస్వీ నాయకులు



నవతెలంగాణ-సిద్దిపేట రూరల్

ఎమ్మెల్యే హరీశ్ రావు కృషితో బాసర ట్రిపుల్ ఐటీలో సిద్దిపేట టాప్‌గా నిలిచిందని బీఆర్ఎస్వీ నాయకులు అన్నారు. సోమవారం నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఎలితాలలో అద్భుతమైన ఉత్తీర్ణత సాధించి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించినటువంటి విద్యార్థులకు బీఆర్ఎస్వీ నాయకులు ఘనంగా సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల పార్టీ అధ్యక్షులు కొనయగారి ఎల్లయ్య , మాజీ ఎంపీపీ ఒగ్గు బాలమల్లు,సీనియర్ నాయకులు కుంబాల ఎల్లారెడ్డి, మట్టే బాల్ రెడ్డి, పూసల కిషన్, దుర్గం పర్శరాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల పార్టీ విద్యార్థి అధ్యక్షులు ఆకుల సతీష్ మాట్లాడుతూ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థుల ఎలా కష్టపడి చదువుకున్నారో ఇకపై చదువులు కూడా అంతే కష్టపడి చదువుకొని ఉన్నత స్థానంలో విద్యార్థినీ, విద్యార్థులు నిలవాలని అన్నారు. పదవ తరగతిలో మీరు కష్టపడి చదువుకొని మాజీ మంత్రివర్యులు హరీశ్ రావు మీకోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని డిజిటల్ కంటెంట్ పుస్తకాలను పరీక్ష సమయంలో అందించామని అన్నారు.హరీశ్ రావు పరీక్ష సమయంలో విద్యార్థుల యొక్క తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు ప్రతిరోజు టెలి కాన్ఫిడెన్స్ నిర్వహించి తగు సూచనలు చేస్తూ విద్యార్థులకు మరింత ప్రోత్సాహించి ఇంత ఉన్నత స్థానానికి తీసుకొచ్చిన హరీశ్ రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సోషల్ మీడియా కన్వీనర్ కమల్ యాదవ్ గ్రామ శాఖ అధ్యక్షులు ప్రేమ్, బీఆర్ఎస్వీ గ్రామా అధ్యక్షులు కిషన్ , తిరుమల్, రాజు, మనీష్, సాగర్, నరేష్ మనోహర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అందరూ చదవాలి అందరూ ఎదగాలి

- జహంగీర్ బాబు



నవ తెలంగాణ - రాయపోల్

'అందరూ చదవాలి అందరూ ఎదగాలి' విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని చేబర్తి గ్రామానికి చెందిన జహంగీర్ బాబు అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వారి మామయ్య జ్ఞాపకార్థం రాత పుస్తకాలు, ప్లేట్స్, పెన్నులు, పెన్సిల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ నిర్మాణానికి విద్య ఎంతో అవసరమని అందుకోసమే విద్యార్థులందరూ తప్పనిసరిగా చదువుకోవాలని, చదువు ద్వారానే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుతామన్నారు. ఇటీవల ఇందుప్రియల్ గ్రామానికి చెందిన మా మామయ్య పోతరాజు రవీందర్ అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం దశదినకర్మ సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు 90 రాత పుస్తకాలు,30 ప్లేట్లు, పెన్సిల్లు, పెన్నులు అందజేశారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలి అన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పోతరాజు రవీందర్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని ఆయన జ్ఞాపకార్థ ఆయన అల్లుడు జహంగీర్ బాబు విద్యార్థులకు రాత పుస్తకాలు, ప్లేట్స్, పెన్నులు పెన్సిల్ అందించడం అభినందనీయమని వారికి పాఠశాల ఉపాధ్యాయ బృందం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, గ్రామస్తులు ఎస్. కుమార్, తిరుపతి, సురేష్ , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ పెళ్లి.. తండ్రి ఆత్మహత్య



నవ తెలంగాణ- దుబ్బాక

కూతురు తనకు ఇష్టం లేని అబ్బాయిని ప్రేమించి పెళ్లి చేసుకుందన్న మనస్థాపంతో ఆ తండ్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన దుబ్బాక మండల పరిధిలోని అచ్చుమా యిపల్లిలో ఆదివారం రాత్రి జరిగింది.ఎస్ఐ వీ.గంగరాజు తెలిపిన వివరాలు...ఇదే గ్రామానికి చెందిన సోమారపు లింగం (42) ఈ నెల 7న తన వ్యవసాయ పొలంలో తూకానికి నీళ్ల పెడతానని భార్యకు చెప్పి సాయంత్రం ఇంట్లోంచి బయటికి వెళ్ళాడు.ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య రేనవ్వ స్థానికుల సహకారంతో వీరి పొలం వద్దకు వెళ్లి వెతక సాగారు.సమీపంలోని వేప చెట్టుకు భర్త లింగం తాడుతో ఉరేసుకున్నాడు.కూతురు వేరే అబ్బాయిని పెళ్లి చేసుకోవడం తండ్రికి ఇష్టం లేదని ఈ విషయంలో గత కొద్ది రోజులుగా లింగం బాధపడుతూ మానసికంగా కృంగిపోయేవాడని భార్య రేనవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైతుల్ని మోసం చేస్తున్న ప్రభుత్వం

- ఎస్.తిరుమల్ రెడ్డి



నవ తెలంగాణ- దుబ్బాక : అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలుచేయడం లేదని, రైతు రుణమాఫీ పేరిట ప్రభుత్వం కాలయాపన చేస్తూ రైతుల్ని మోసం చేస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సత్తు తిరుమల్ రెడ్డి విమర్శించారు.ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని తెలంగాణలో అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, కౌలు రైతులకు ఆర్థిక సహకారాన్ని అందిస్తానని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా..నేటికీ అమలు చేయకపోవడానికి నిరసిస్తూ సోమవారం దుబ్బాక పురపాలిక పరిధిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ శ్రేణులు నేలపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు.అనంతరం తహసీల్దార్ వెంకట రెడ్డికి వినతిపత్రం అందించారు.ఈ నిరసనలో బీజేపీ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు కే.సుభాష్ రెడ్డి,నాయకులు గాజుల భాస్కర్,రమేష్ రెడ్డి,శ్రీకాంత్,సాయి గౌడ్,రాజు యాదవ్ పలువురు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి

- దేవరాజ్ ముదిరాజ్

నవతెలంగాణ- దుబ్బాక

అంకితభావంతో పనిచేస్తూ తారతమ్య భేదాల్లేకుండా అందరితో మమేకమై నిరంతరం ప్రజా సేవ కోసం పరితపించే ప్రజా నాయకుడు తాజా మాజీ జెడ్పీటీసీ కడతాల రవీందర్ రెడ్డి అని కేపీఆర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ఉపసర్పంచ్ దేవరాజ్ ముదిరాజ్ అన్నారు. ఐదేళ్ల పదవీకాలంలో ఎంతో మంది యువకులకు ప్రోత్సాహ మందించి నాయకు లుగా తీర్చిదిద్దిన ఘనత రవీందర్ రెడ్డి దేనని కొనియాడారు. సోమవారం దుబ్బాక మండల పరిధిలోని జెడ్పీటీసీస్వగ్రామం తిమ్మాపూర్‌లో కేపీఆర్ యువసేన ఆధ్వర్యంలో జెడ్పీటీసీ సభ్యుడు కడతల రవీందర్ రెడ్డిని శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహుకరించారు.తాజా మాజీ సర్పంచ్ కండ్లకొయ్య పర్శరాములు, నాయకులు మహేష్ యాదవ్, ఎమ్మ యాదగిరి,బైకరి పర్శరాములు యాదవ్,మండల రవి,శివ,ముక్కపల్లి మహేందర్, మహమ్మద్ సాజిద్,మర్కంటి నవీన్ ఉన్నారు.

